

'సోమశిల'కు తగ్గిన వరద

అనంతసాగరం నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఇన్‌ఫ్లో తగ్గింది. బుధవారం 9012 క్యూసెక్కుల నీరు వస్తుండగా, గురువారానికి 7,844 క్యూసెక్కులకు పడిపోయింది. ఇక డ్యాంలో 72.541 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ ఉత్తర కాలువకు 50, కండలేరుకు 560 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

● **రాపూరు :** కండలేరు డ్యాం సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 58.28 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 800 క్యూసెక్కుల నీరు బయటకు వదులుతున్నట్లు పేర్కొన్నారు.



నెల్లూరులోని 35/1 సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న కమిషనర్ నందన్



సంగం -1 సచివాలయంలో హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న ఎమ్పీడీవో షాలెట్

ఎవరు.. ఎక్కడున్నారు!?

- సచివాలయాలపై కార్యాచరణకు కదిలిన అధికార యంత్రాంగం
- సిబ్బంది గైర్హాజరుపై కలెక్టర్ హిమాన్షు శుక్లా సీరియస్
- ఉదయాన్నే జిల్లా, మండల అధికారులతో టెలీకాన్ఫరెన్స్
- ప్రత్యేక బృందాలతో జిల్లావ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు
- 260 సచివాలయాల్లో 84 మంది గైర్హాజరు.. షోకాజ్ నోటీసుల జారీ

నెల్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజ్యోతి కథనాలు అధికార యంత్రాంగాన్ని కదిలించింది. పాలనా వ్యవస్థను ప్రజలకు మరింత దగ్గరగా తీసుకు రావాలనే ఉద్దేశంతో నెలకొల్పిన సచివాలయాల వ్యవస్థ, సేవలపరంగా గాడితప్పుతోందన్న విషయాన్ని ఆధారాలతో సహా గురువారం ప్రచురించింది. జిల్లావ్యాప్తంగా సచివాలయాల పనితీరును పాలకులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావడానికి క్షేత్రస్థాయిలో ఆంధ్రజ్యోతి బృందం సచివాలయాలను సందర్శించింది. సచివాలయాల పనితీరులో ఉన్న లోపాలను, సిబ్బందిలో లోపించిన జవాబుదారీతనాన్ని సున్నితంగా అధికారులు, ప్రజల ముందుకు తీసుకొచ్చింది. 'ఆరుగురికి ఇద్దరు' అనే శీర్షికన జిల్లా సంచికలోనూ, 'సచివాలయ పాలన పట్టాలెక్కించాలి' శీర్షికన ప్రధాన సంచికలోనూ కథనాలు ప్రచురితం కావడంతో జిల్లా పాలనా యంత్రాంగంలో పెద్ద కదలిక తీసుకొచ్చింది. ఈ కథనాలపై కలెక్టర్ హిమాన్షు శుక్ల తీవ్రంగా స్పందించారు.



సీతారామపురంలో..

● రంగంలోకి 70 బృందాలు

గురువారం ఉదయం 7 గంటలకే టెలీకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా, మండల స్థాయి అధికారులతో మాట్లాడారు. సచివాలయాల వారీగా (మిగతా 6లో..)

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కిడ్నీ వ్యాధుల గుర్తింపునకు
కదిలిన యంత్రాంగం

నెల్లూరురూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : కిడ్నీ వ్యాధులు ఎందుకు వస్తున్నాయి? వాటి మూలాలు ఎక్కడున్నాయి? తెలుసుకునేందుకు ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. నెల్లూరురూరల్‌లోని కొమ్మరపూడి, కొత్తవెల్లంటి గ్రామాలలో మంచినీటి నమూనాలను గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు బుధ, గురువారాల్లో సేకరించారు. ఈ నెల 10వ తేదీన ఈ గ్రామాలపై ఆంధ్రజ్యోతి ప్రచురించిన 'ఆ.. ఊళ్లకు కిడ్నీ జబ్బు' శీర్షికతో అధికారుల్లో కదలిక వచ్చింది. ఈ మేరకు నివాసాల్లోని పంచాయతీ కొళాయిలు, తాగునీటి ట్యాంకులు, మినరల్ వాటర్ ప్లాంట్ల వద్ద నీటి నమూనాలను సేకరించారు. వాటిని పరీక్షలకు పంపి నీటిలో కిడ్నీ వ్యాధులకు దోహదపడే అంశాలేమైన ఉన్నాయోనన్న కోణంలో విశ్లేషణ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అటు వైద్య, ఆరోగ్య శాఖ కూడా కిడ్నీ వ్యాధుల వ్యాప్తిపై క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేస్తోంది.



కొమ్మరపూడిలో నీటి నమూనాలు సేకరిస్తున్న అధికారి

పీఎంశ్రీ పాఠశాలల అభివృద్ధికి
రూ.1.91 కోట్లు విడుదల

నెల్లూరు (విద్య), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగం ఉన్నతిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పీఎంశ్రీ పాఠశాలల్లో అభివృద్ధి పనులకు రూ.1.91 కోట్ల విడుదల చేసిందని సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య తెలిపారు. నగరంలోని జిల్లా విద్యాశాఖలోని సమగ్రశిక్ష కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలో 46 స్కూల్స్ పీఎంశ్రీ పథకం కింద ఉన్నాయని, వీటిలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులన్నీ పూర్తి చేసి సిద్ధం చేయగా ఈ ఏడాది ఆరు అంశాలకు సంబంధించి జరుగుతున్న పనులకు నిధులను విడుదల చేశారన్నారు. తాజాగా 7వ విడతగా మరో 4 పాఠశాలల్లో 29 పనులకు సంబంధించి రూ.1.91 కోట్లు విడుదలయ్యాయన్నారు. ఈ నిధులతో అల్లూరు మండలంలోని అల్లూరుపేట జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో బయాలజీ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ గది, లైబ్రరీ, ప్లేఫీల్డ్‌లు, టీపీగూడూరు మండలం కోడూరులోని ఏపీడబ్ల్యూఆర్‌ఎస్ పాఠశాలలో కంప్యూటర్ గది, లైబ్రరీ, ప్లేఫీల్డ్‌లను నిర్మిస్తామన్నారు. అలాగే సంగంలోని ఏపీడబ్ల్యూఆర్‌ఎస్ పాఠశాలలో కెమిస్ట్రీల్యాబ్, ప్లేఫీల్డ్‌లను, ఉలవపాడులోని వీరేపల్లి ఏపీ మోడల్ స్కూల్‌లో అదనపు తరగతిగదులు, ప్లేఫీల్డ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ పనులన్నీ వేగవంతంగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.



నగరంలోని గిరిజన సంక్షేమ హాస్టల్‌లో భోజనం రుచి చూస్తున్న కాంతారావు

హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు కాంతారావు
- ప్రజలకు ఇబ్బందులు రానీయొద్దంటూ ఆదేశాలు

8



సామాజిక మాధ్యమాలు, సమాజంలో చోటు చేసుకుంటున్న పలు సంఘటనలు, ఆకతాయిల వేధింపులతో మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇవన్నీ ఎవరికీ చెప్పుకోలేక వారిలో వారే మానసికంగా కుమిలి పోతున్నారు. కొందరు మహిళలు గృహ హింసకు గురవుతున్నారు. మహిళలు ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారం చూపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఇబ్బందులకు గురవుతున్న మహిళల కోసం జెండర్ రిసోర్స్ సెంటర్ (జీఆర్‌సీ)లను ఏర్పాటు చేయిస్తోంది.

- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)

అతివకు అండగా..

- జిల్లాలో జెండర్ రిసోర్స్ సెంటర్లు
- మహిళా సమస్యలకు పరిష్కార కేంద్రాలివి
- తొలిగా 8 మండలాల్లో ఏర్పాటు.. త్వరలో జిల్లావ్యాప్తంగా

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళా ప్రతినిధులే జెండర్ రిసోర్స్ సెంటర్లను నిర్వహిస్తారు. కోవూరు, గుడ్లూరు, వెంకటాచలం, పొదలకూరు, కావలి, కలిగిరి, ఆత్మకూరు, రాపూరులలో ఈ నెల 20వ తేదీలోగా వీటిని ఏర్పాటు చేయనున్నారు. త్వరలో జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ ఏర్పాటు చేయనున్నారు. ఈ సెంటర్ల ద్వారా ఇబ్బందులు పడుతున్న, ఇబ్బందులకు గురైన మహిళలను గుర్తించి, వారికి తామున్నామంటూ భరోసా కల్పిస్తారు. తగిన న్యాయం చేస్తారు. ఇబ్బందులకు గురిచేస్తున్న వారికి శిక్ష పడేలా అన్నీ చర్యలు తీసుకుంటారు. అంతేగాక బాధిత మహిళలకు జీఆర్‌సీలలో ఒకటీ రెండు రోజుల పాటు వసతి కల్పిస్తారు.

● ఒక్కో కేంద్రానికి రూ.5 లక్షలు

ఒక్కో జీఆర్‌సీ నిర్వహణ కోసం రూ.5లక్షల వంతున మంజూరు చేసింది. ఈ నిధులతో మూడేళ్లపాటు సెంటర్‌ను నిర్వహిస్తారు. అంతేగాక ఒక్కో పొదుపు సంఘంలోని ఒక్కో మహిళ నుంచి సంవత్సరానికి రూ.12 వసూలు చేసి, ఓ నిధిలా ఏర్పాటు చేస్తారు. ఆ సొమ్ముతో మూడేళ్ల తర్వాత జీఆర్సీ నిర్వహణకు ఖర్చు చేస్తారు.



అందే సేవలు ఇలా..

- జీఆర్‌సీలకు వచ్చే మహిళలకు లైంగిక, వరకట్న వేధింపులు, ఇతర సమస్యలపై కౌన్సెలింగ్ ఇస్తారు.
- వేధింపులకు అడ్డుకట్ట వేయటం, వేధిస్తున్న వారికి శిక్ష పడేలా చేయటం
- బాల్య వివాహాలను అరికట్టడం
- మహిళలలో నాయకత్వ లక్షణాలపై అవగాహన, నిర్ణయాధికారం కల్పించడం
- హింసలేని జీవితాన్ని అందించడం
- మహిళలకు సమాన పనికి సమాన వేతనం అందేలా చూడటం
- ఆస్తి హక్కులో వాటా వచ్చేలా చూడటం
- పోషకాహారం అందేలా చూడటం
- బాలికలను ఉన్నత విద్యను అభ్యసించేలా చేసి, వారు మంచి ఉద్యోగాలు సాధించేలా ప్రోత్సహించటం

● జీఆర్సీలలో సీఆర్పీలు

మండల స్థాయి జెండర్ రిసోర్సు సెంటర్లలో ఇద్దరు క్లస్టర్ రిసోర్సు పర్సన్స్ ఉంటారు. గ్రామస్థాయిలో సోషల్ యాక్టివ్ కమిటీలు ఉంటాయి. ఈ కమిటీ సభ్యులతో మండల స్థాయి కమిటీని ఎన్నుకుంటారు. మండల స్థాయి కమిటీలో చైర్మన్, కార్యదర్శి, కోశాధికారి ఉంటారు. పొదుపు సంఘాల్లో బాగా చదువుకున్న, సమాజిక సేవా భావమున్న వారిని ఈ కమిటీలకు ఎంపిక చేస్తారు.

జీఆర్సీలలో సాయం పొందొచ్చు



ఏదైనా సమస్య ఉంటే మహిళలు జెండర్ రిసోర్సు సెంటర్లలో సంప్రదించవచ్చు. పొదుపు సంఘాల మహిళలే కాదు, ఎవరైనా ఈ కేంద్రాలను ఆశ్రయించి సాయం పొందవచ్చు. ప్రస్తుతం జిల్లాలో మూడు ప్రాంతాలలో ఈ సెంటర్లు ఏర్పాటు అయ్యాయి. మిగిలిన చోట్ల కూడా ఏర్పాటు చేయిస్తాం. బాధిత మహిళకు తక్షణ పరిష్కారం అందేలా ఈ సెంటర్ల ద్వారా చర్యలు తీసుకుంటారు.

- వి. నాగరాజ కుమారి, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ

భయోబెటిస్

- ఆందోళన కలిగిస్తున్న మధుమేహం
- జిల్లాలో 5 లక్షల మందికిపైగా వ్యాధిగ్రస్థులు
- వారిలో చిన్నారులు 30వేల మంది
- అందుబాటులో ఎన్నో ఆధునిక మందులు
- ప్రతి నెల రూ.5 కోట్లకుపైగా ఖర్చు
- నేడు ప్రపంచ మధుమేహ నివారణ దినం

చక్కెర వ్యాధి... తియ్యగా జనాలను చంపేస్తోంది. అతిగా తిన్నా అసలు తినకపోయినా ఒంట్లో విజృంభిస్తుంది. ఏదిపడితే అవి ఆరగిస్తే అమాంతం పెరిగి అలజడి రేపుతుంది. మేల్కొని ముందుగానే జాగ్రత్త పడకపోతే మెల్లమెల్లగా జడలువిప్పుతూ శరీరంలోని మిగిలిన అవయవాలను నిర్వీర్యం చేసేస్తుంది.



ఈ మధుమేహం జిల్లా వాసులను కలవర పెడుతోంది. మారుతున్న ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవటం వంటి కారణాల వల్ల డయాబెటీస్ ప్రబలుతోందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అవగాహన లోపం, నిర్లక్ష్యంతో ఎంతో మంది మధుమేహులు చివరకు అవయవాలు దెబ్బతిని ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. జిల్లాలో రమారమి 27 లక్షల మంది జనాభా ఉండగా వారిలో 5 లక్షల మందికిపైగా మధుమేహ రోగులు ఉన్నారంటే దీని తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు వీరిలో 30 వేల మంది చిన్న పిల్లలు ఉండటం గమనార్హం. మరో లక్ష మంది వరకు వ్యాధికి చేరువలో ఉన్నట్లు వైద్యుల అంచనా. జిల్లాలో 12 ఏళ్ల క్రితం వేల సంఖ్యలో ఉన్న వ్యాధిగ్రస్తులు ప్రస్తుతం లక్షలకు చేరటం ఆందోళనకరం.

- సమగ్ర కథనం 8లో..



అళ్వార్.. అదుర్స్!

వలేటివారిపాలెంలో కొత్త రకం పంట సాగు
80 ఎకరాలలో సాగు చేపట్టిన రైతు రెడ్డయ్య

సింగపూర్ టూర్‌కు
ముగ్గురు టీచర్ల ఎంపిక

అధునాతన విద్యపై అధ్యయనం ● 27 నుంచి పర్యటన

వామ్మో చలి.. వాన

వాతావరణంలో అనూహ్య మార్పు
నెల్లూరు నగరంలో అక్కడక్కడా వర్షం



8 లో..

సాగునీటిని పొదుపుగా వాడండి. ప్రాజెక్టుల్లో నీరు ఉంది కదా అని ఇష్టానుసారం విడుదల చేయవద్దు. ఒక టీఎంసీతో కనీసం 10 వేల ఎకరాలు పండించేలా చర్యలు తీసుకోవాలి. గత ప్రభుత్వంలో నీటిని దుర్వినియోగం చేసినట్లుగా ఇప్పుడు అధికారుల పనితీరు ఉంటే చర్యలు తప్పవు. చివరి ఎకరా వరకూ రైతులకు ఇబ్బందులు కలగకుండా నీరు అందించాలి.

- ఇటీవల జరిగిన ఐఏబీ సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేల మాటలివి

ప్రాజెక్టులు, కాలువల మీద నీటి యాజమాన్యం చేసేందుకు సిబ్బంది లేరు. కీలకమైన లస్కర్లను ఇప్పటికీ నియమించలేదు. ఏ కాలువ కింద ఎప్పుడు గేట్లు ఎత్తాలి? ఎప్పుడు దించాలి? అన్న విషయాలను రైతులు ఎవరికి చెప్పుకోవాలో తెలియదు. నీటి లెవల్స్ చూసుకునే వారు లేకపోవడంతో నెల్లూరు బ్యారేజీ నుంచి నీరు వృథాగా సముద్రంలోకి వెళుతుండగా, సర్వేపల్లి కాలువకు మట్టం పడిపోయింది.

- ఇదీ క్షేత్రస్థాయి పరిస్థితి



నీటి యాజమాన్యం
ఎలా!?

- ఈ ఏడాదీ లస్కర్ల నియామకం లేనట్టే!
- అనుమతులు మంజూరు చేయని ప్రభుత్వం
- పెండింగ్ వేతనాలతో అనధికార విధులకూ అనాసక్తి
- బ్యారేజీల వద్ద పడిపోతున్న కాలువల లెవల్స్

నెల్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి యాజమాన్యంలో కీలకమైన లస్కర్ల వ్యవస్థకు పట్టిన గ్రహణం వీడటం లేదు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన పొరపాటు ఇంకా కొనసాగుతూనే ఉంది. గడిచిన మూడేళ్లుగా లస్కర్లు లేకుండానే సాగు జరుగుతోంది. ఈ ప్రభావం రైతాంగంపై తీవ్రంగా పడుతోంది. ముఖ్యంగా చివరి ఆయకట్టు రైతులు నీటి కోసం కాలువలపై కాపలా కాయాల్సిన దుస్థితి నెలకొంటోంది. ప్రతీ సీజన్‌లోనూ అనధికారికంగా ఇరిగేషన్ అధికారులు కొంతమంది లస్కర్లను నియమించుకొని నెట్టుకొస్తున్నారు. వీరికి వేతనాలు కూడా ఇవ్వకపోతుండటంతో వారు కూడా కాలువలపైకి అలా వచ్చి ఇలా వెళ్లిపోతున్నారు. కొన్ని కాలువలపై రైతులే షట్టర్లు ఎత్తి, దించుకోవాల్సి వస్తోంది. ప్రస్తుతం రబీ సీజన్ ప్రారంభం కాగా పూర్తి ఆయకట్టులో సాగుకు నీటి కేటాయింపులు జరిపారు. కానీ ఇంతవరకూ లస్కర్ల నియామకానికి అనుమతులు మంజూరు చేయలేదు.

● అనుమతి రావడం లేదు

ప్రకృతి సహకరించడం, ప్రాజెక్టుల్లోకి పుష్కలంగా నీరు చేరడంతో ఈ ఏడాది పూర్తి ఆయకట్టుకు నీటి కేటాయింపులు జరిపారు. సోమశిల, కండలేరు జలాశయాల కింద 7.30 లక్షల ఎకరాల ఆయకట్టు సాగు జరగనుంది. ఈ సమయంలో లస్కర్ల అవసరం చాలా ఉంది. కానీ వైసీపీ ప్రభుత్వంలో జరిగిన తప్పే ఇప్పుడూ జరుగుతోంది. 2022 నుంచి జిల్లాలో ఉన్న 223 మంది లస్కర్లను తొలగించారు. అప్పటి నుంచి రైతాంగం, ఇరిగేషన్ అధికారులు ప్రతీ సీజన్‌లోనూ తంటాలు పడుతూ నీటి యాజమాన్యం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గతేడాది లస్కర్ల నియామకానికి ప్రతిపాదనలు పంపినా అనుమతులు లభించలేదు. అనుమతులు లేకపోవడంతో గడిచిన మూడు సీజన్లకు సంబంధించిన సుమారు రూ.3 కోట్ల వేతనాలు లస్కర్లకు బకాయిలు ఉన్నాయి. అయితే ఈ ఏడాది కూడా లస్కర్ల నియామకానికి అనుమతులు రాలేదు. ప్రతీ జిల్లాస్థాయి సమావేశంలో ఈ లస్కర్ల అంశాన్ని ఎమ్మెల్యేలు ప్రస్తావిస్తూ వస్తున్నారు. కానీ ఫలితం మాత్రం ఉండడం లేదు.

ప్రతిపాదనలు పంపాం

లస్కర్ల నియామకానికి సంబంధించి ప్రతిపాదనలు పంపాం. ఇటీవల కొంత వేతనాలు చెల్లించాం. పెండింగ్ వేతనాలు కూడా చెల్లించేందుకు ప్రయత్నిస్తున్నాం. రైతుల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని ఓఅండ్ఎం వర్కుల కిందనే లస్కర్లను నియమించుకునేలా సాగునీటి సంఘాలు తీర్మానం చేసుకుంటున్నాయి.

- దేశా నాయక్, ఇరిగేషన్ ఎస్ఈ

● కడతామన్నా కట్టించుకోరే!

సాధారణంగా లస్కర్లకు వేతనాలను రైతుల నుంచి వసూలు చేసే శిస్తు ద్వారా చెల్లిస్తుంటారు. అయితే - మిగతా 7లో..

విలువైన అటవీ సంపదపై
డేగ కన్ను వేయాలి

సీతారామపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బేస్ క్యాంప్ స్టైకింగ్ ఫోర్స్ సిబ్బందితోపాటు అటవీ సిబ్బంది నిత్యం అటవీ ప్రాంతాల్లో పర్యవేక్షిస్తూ విలువైన అటవీ సంపదపై డేగ కన్ను వేయాలని జిల్లా అటవీ శాఖ అధికారి మహబూబ్ బాషా సూచించారు. సీతారామపురం మండలంలోని పంద్రంగి, దేవమ్మచెరువు బీట్‌ల పరిధిలో గల అటవీ ప్రాంతాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఎర్రచందనం వృక్షాల పెరుగుదలతోపాటు స్మగ్లింగ్ కార్యకలాపాలు, ఎర్రచందనం డంప్‌లపై ఆరా తీశారు. అనంతరం దేవమ్మ చెరువు, నారాయణపేట గ్రామాల వద్ద గల ఫారెస్ట్ చెక్‌పోస్టులను తనిఖీ చేసి ప్రతి వాహనాన్ని నిశితంగా పరిశీలించిన తర్వాతే పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ డీఎఫ్‌ఓ శ్రీకాంత్‌రెడ్డి, ఎఫ్‌ఆర్‌ఓ కుమార్‌రాజా, డీఆర్వో కెవి ప్రసాదు, ఎఫ్‌బీఓలు గౌతమ్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



అటవీ ప్రాంతంలో వృక్షాలను పరిశీలిస్తున్న జిల్లా అటవీ శాఖ అధికారి మహబూబ్ బాషా

మొగళ్లూరులో టిడ్కో ఇళ్లు నిర్మాణం

పొదలకూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పేదల సొంతింటి కలను నిజం చేయాలనే ప్రభుత్వ లక్ష్యంలోభాగంగా ఏపీ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీ టిడ్కో) మండలంలోని మొగళ్లూరు గ్రామంలోని ఎల్పీఎం నెంబరు 945 (పాత సర్వే నెంబరు 268)లోని ప్రభుత్వ భూమిని 100 ఎకరాలను తీసుకోవడానికి మంత్రివర్గం ఆమోదించింది. ఈ మేరకు గురువారం ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి విజయవాడలోని ఏపీ టిడ్కో మేనేజింగ్ డైరెక్టర్‌కు ప్రభుత్వం ఉత్తర్వులు అందాయి.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 12120
వెండి కిలో ధర	రూ. 168500
వెండి ఒక గ్రాము	రూ. 174.50

ఆకుపై చాచా..



ఆకుపై నెహ్రూ చిత్రం

మనుబోలు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నేడు జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా గురువారం వీరంపల్లి తెలుగు పండిట్ సోమా పద్మారత్నం జామ ఆకుపై నీటిరంగులతో, కాగితంపై కార్వింగ్ చిత్రాలను గీసి పాఠశాలలో ప్రదర్శించారు. బాలల దినోత్సవం సందర్భంగా ఈ పద్ధతిలో సోమా పిల్లలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

అయ్యప్పస్వామి ఆలయ భూములకు వేలం



వేలం వేస్తున్న అధికారులు

విడవలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని చౌకిచర్ల తుమ్మగుంటలో వెలసివున్న అయ్యప్ప స్వామి ఆలయానికి సంబంధించిన 11.48 సెంట్లు భూములను మూడు సంవత్సరాలు పాటు కౌలుకి ఇచ్చేందుకు గురువారం దేవాదాయశాఖ అధికారులు వేలం పాటలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన వేలం పాటలో సుమారు 10 మంది రైతులు పాల్గొని వేలం పాటలను పాడారు. ఈ వేలం పాటలో గతేడాది రూ.1.70లక్షలు పోయిన పాట ఈ సారి రూ.3.05 లక్షలకు విడవలూరుకి చెందిన కాలహస్తీ మల్లికార్జున భూములను పాడుకున్నారు.

స్వమిత్వ గ్రామసభ

మనుబోలు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టువపల్లి సచివాలయంలో స్వమిత్వ పథకంపై గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభను ఎంపీడీవో జలజాక్షి నిర్వహించారు.

యువతి ఆచూకీ లభ్యం

ఉదయగిరి, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని వెంకట్రావు పల్లి గ్రామానికి చెందిన యువతి అదృ శ్యమైన విషయంపై తల్లిదండ్రులు పోలీ సులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి బుధవారం కేసు నమోదు చేశారు. యువతి అచూకీ కోసం సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు ప్రకాశం జిల్లా టంగుటూరులో యువతి ఉన్నట్లు గుర్తించి గురువారం ఉదయగిరికి తీసుకొచ్చారు.

పేదల సొంతింటి కల నెరవేరుస్తాం!

ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



పదవులు పొందిన కార్యకర్తలతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో పేదలందరికీ సొంత ఇంటి కల నెరవేర్చే బాధ్యత తీసుకుంటామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని వరిగొండ పంచాయతీ రావూరు కండ్రిగ ఎస్టీ కాలనీలో శ్రీమహాలక్ష్మమ్మ ఆలయ ప్రతిష్ట మహో త్సవంలో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించి, అనంతరం మీడియాతో మాట్లాడుతూ శ్రీమ హాలక్ష్మమ్మ అమ్మవారిని దర్శించుకోవడం చాలా ఆనం దంగా ఉందని, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని కోరుకుంటున్నామన్నారు. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.10 లక్షలు మంజూరు చేయిస్తే గత ప్రభుత్వంలో నిర్మాణాలు పూర్తి చేయకుండా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక నాయకులు అదనంగా కొంత మొత్తాన్ని వేసి దేవాలయ నిర్మాణం పూర్తి చేశారని తెలిపారు. అప్పట్లోనే గిరిజన కాలనీ కోసం 5.50 ఎకరాలను మా చిన్నాన్న సోమిరెడ్డి రాధాకృష్ణారెడ్డి ఉచితంగా అందించారని, ఇప్పుడు ఈ భూమి విలువ ఎకరా రూ.5 కోట్లకుపైనే ఉంటుందన్నారు. మొదట నుంచి గిరిజన కుటుంబాలకు అండగా ఉండి ఇళ్ల నిర్మాణాలు చేప ట్టామని తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వం రూ.2.30 లక్షలు ఇస్తుంటే దానిని రూ.1.80 లక్షలు తగ్గించేశారని, కూటమి ప్రభుత్వం వచ్చాక గిరిజనులకు రూ.75వేలు పెంచి రూ.2.55లక్షలు చేశామన్నారు. ఇళ్ల నిర్మాణంలో అక్రమాలకు పాల్పడి హౌసింగ్ శాఖను అవినీతికి అడ్డాగా వైసీపీ ప్రభుత్వం మార్చేసిందని తెలిపారు. ఈ కార్య క్రమంలో విజయా డెయిరీ డైరెక్టర్ కోడూరు శ్రీనివాసులు రెడ్డి, కర్పూరం శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక నేతలు, తదితరులు పాల్గొన్నారు.

చేరెడ్డికి ఎమ్మెల్యే నివాళి



చేరెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

మనుబోలు: మనుబోలు టీడీపీ సీనియర్ నాయకులు చేరెడ్డి కోదండరామిరెడ్డి (85) అనారోగ్యంతో నెల్లూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం కన్ను మూశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మనుబోలులోని చేరెడ్డి నివాసానికి చేరుకుని ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన సోదరులు చేరెడ్డి పట్టాభిరామిరెడ్డి, కృష్ణారెడ్డిలను సోమిరెడ్డి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎమ్మెల్యేతో పాటు పలువురు టీడీపీ, వైసీపీ నాయకులు కోదండరామిరెడ్డి మృతిపట్ల సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, నాయకులు సాని వెంకటరమణయ్య, వెడిచెర్ల వెంకటరమణారెడ్డి, రాయపాటి కిరణ్‌కుమార్, హనుమంతనాయుడు, చింతల వెంకటేశ్వర్లు, దండు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతిపై సమీక్ష

నెల్లూరు (వైద్యం) : పీ4లో భాగంగా సర్వేపల్లి నియోజక వర్గంలో గిరిజన కాలనీల దత్తతపై సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గురువారం అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. నెల్లూరు నగరంలోని ఆర్‌ఎండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో డ్వామా పీడీ గంగాభవాని, ఎంపీడీవో, వివిధ కంపెనీ ప్రతినిధులతో కలిసి పలు అంశాలపై చర్చించారు. నియోకవర్గంలోని మల్లికార్జున పురంలో గిరిజన కుటుంబాలను సెయిల్ కంపెనీ దత్తత తీసుకుని ప్రత్యేక కిట్లు పంపిణీపై, బ్రహ్మదేవంలో గిరిజన కాలనీలో జెమిని కంపెనీ రూ. 93 లక్షలతో పనులు ప్రారంభించిన నేపథ్యంలో మిగిలిన కంపెనీలు కూడా కార్యాచరణతో ముందుకు వెళ్లాలని సోమిరెడ్డి సూచించారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ముత్తుకూరు ప్రాంతంలో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి సెయిల్ కంపెనీ సీఈవో మహాపాత్ర, సీఆర్ఎస్ హెడ్ రఘురామ్‌ను సోమిరెడ్డి కోరగా అందుకు వారు సానుకూలంగా స్పందించారు.

కార్యకర్తల రుణం తీర్చుకుంటా..

వెంకటాచలం: సర్వేపల్లి నియోజకవర్గంలోని 5మండలాల్లో కార్యకర్తల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చెముడుగుంట స్రిడ్స్ కల్యాణ మండపంలో గురువారం 5మండలాల ప్రధాన కమిటీలతో పాటు, అనుబంధ సంఘాల కమిటీలు, క్లస్టర్, గ్రామ, యూనిట్, బూత్ కమిటీలచే ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమాలను ఎమ్మెల్యే నిర్వహించారు. అంతకు మునుపు టీడీపీ జెండా ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ సర్వేపల్లి టీడీపీ కేడర్‌కు పార్టీతో పాటు నేనూ రుణపడిఉన్నానన్నారు. గడిచిన 5 ఏళ్ళలో కార్యకర్తలు వైసీపీ అరాచకపాలనలో కష్టాలు అనుభవించారన్నారు. గతంలో రాష్ట్రమంతా అన్యాయాలు, అక్రమాలు జరిగితే సర్వేపల్లిలో మాత్రం అరాచకాలు చేశారన్నారు. వీటన్నింటిని తట్టుకుని పోలీసు కేసులకు భయపడకుండా తన గెలుపునకు కారకులైన నాయకులు కార్యకర్తలను ఎప్పటికీ మరిచిపోనన్నారు. రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల డైరెక్టర్ల పదవులు నియోజకవర్గంలో ముగ్గురికి దక్కాయన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలను సాధించుకునేందుకు కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 5మండలాల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు : తోటపల్లిగూడూరు టీడీపీ మండల నాయకులు చెముడుగుంట శీడ్స్ కళ్యాణ మండపంలో గురువారం జరిగిన తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొణతం రఘుబాబు, ప్రధాన కార్యదర్శి మన్నెం జితేంద్ర, కార్యవర్గ సభ్యులచే సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కొణతం మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికి పార్టీ గుర్తించి పదవులు ఉంటాయని తెలిపారు. అనంతరం వీరిని మండల నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.

మనుబోలు: ఇదివరకు ఎన్నుకున్న టీడీపీ మండల కమిటీ సభ్యులచే ఎమ్మెల్యే గురువారం వెంకటాచలంలో ప్రమాణ స్వీకారం చేయించారు. మండల అధ్యక్షు లుగా పొన్నూరు రామకృష్ణయ్య, ఉపాధ్యక్షుడుగా మన్నె మాల ఆదినారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మధునా యుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా మానుగుంట సుధాకర్ రెడ్డి, సర్వేపల్లి శివకుమార్ శర్మ, పిడూరు మల్లికార్జునరెడ్డి, కార్యదర్శులుగా మేదెరమెట్ల సోమశేఖర్‌నాయుడు, బోయిన ఆదినారాయణ, నారాయణ ఆదిశేషయ్య, కోశాధికారిగా కలికి వినీల్‌రెడ్డిచే ప్రమాణస్వీకారం చేశారు.

57ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు

వెంకటాచలం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక రామదాసుకండ్రిగలో పారిశ్రామిక వాడ రాబోతుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం రాత్రి రామదాసు కండ్రిగలో ఇటీవల కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కు శిలాపలకంను పార్కుకు కేటాయించిన స్థలంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లేఅవుట్ నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయిందన్నారు. లేఅవుట్ పూర్తికాగానే చిన్నపాటి పరిశ్రమలు స్థాపించాలనుకునే వారికి 7, 14, 39 సెంట్ల స్థల కేటాయింపులు చేస్తారన్నారు. ఈ పార్కుకు వచ్చే పరిశ్రమలతో ఎంతోమంది యువతకు ఉపాధి అవకాశాలు రాబోతున్నాయన్నారు. 2024ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు ఈ 57ఎకరాలు అప్పటి సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి అల్లుడికి కేటాయిస్తూ జీవో విడుదలైందన్నారు. అల్లుడికోసం కాకాణి ఒక బినామీ కంపెనీ పేరుతో 57ఎకరాలు కేటాయించేశారని ఎమ్మెల్యే ఆరోపించారు. పరిశ్రమలు వస్తే పన్నుల రూపంలో పంచాయతీలకు ఆదాయాలు సమకూరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటాచలం టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అపస్మా స్పోర్ట్స్ మీట్ కరపత్రం ఆవిష్కరణ

వింజమూరు, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలోని ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో మనో హర్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి అపస్మా స్పోర్ట్స్ మీట్ సందర్భంగా ఉదయ గిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ స్పోర్ట్స్ మీట్ కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

ఎవరు.. ఎక్కడున్నారు!

(5వ పేజీ తరువాయి)

ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనాల ఆధారంగా ఎంపీడీఓలను ప్రశ్నించారు. సిబ్బంది గైర్హాజరు కావడం, ఏదో ఒక నెపంతో సచివాలయానికి దూరంగా సొంత పనులకు నిమగ్నం కావడం పట్ల కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఉన్న పళంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న సచివాలయాలను ఆకస్మిక తనిఖీలు చేయమని ఆదేశించారు. అందుకోసం ప్రత్యేకంగా ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓ, మరి కొంతమంది జిల్లా అధికారులతో 70 బృందాలు ఏర్పాటు చేశారు. ఈ బృందాలు గురువారం ఉదయం నుంచి సచివాలయాలను ఆకస్మిక తనిఖీలు చేశారు. జిల్లావ్యాప్తంగా 779 సచివాలయాలు ఉండగా వాటిలో 260 సచివాలయాలను గురువారం ఒక్కరోజే తనిఖీలు చేశారు. సచివాలయాల్లో ఎంత మంది ఉండాలి, ఎంత మంది ఉన్నారో పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్లను, మూవ్‌మెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. వీరు సందర్శించిన సచివాలయాల్లో మొత్తం 1967 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా 1566 మంది మాత్రమే సచివాలయాల్లో ఉన్నారు. మిగిలిన 369 మంది కనిపించలేదు. వీరికి సంబంధించిన అటెండెన్స్‌ను, మూవ్‌మెంట్ రికార్డులను పరిశీలించారు. వీరిలో చాలా మంది ఫీల్డ్‌లోకి వెళ్లారని సహ సిబ్బం ది సమాచారం ఇవ్వడంతో మూవ్‌మెంట్ రిజిస్టర్లు పరిశీలించారు. ఇందు లో 84 మంది సిబ్బంది ఎలాంటి స మాచారం లేకుండా గైర్హాజరు అయ్యారనే విషయాన్ని గుర్తించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్య వైఖరికి సమాధానం ఇవ్వాలని ఆ 84 మంది సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. నెల్లూరులో కమిషనర్ నందన్, కార్యదర్శి శ్రీలక్ష్మి, సిటీ ప్లానర్ హిమబిందులు తనిఖీల్లో పాల్గొనగా, మండల స్థాయిలో ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, పలువురు జిల్లాస్థాయి అధికారులు తనిఖీల్లో పాల్గొన్నారు .



లింగసముద్రంలో..

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

వెంకటాచలం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుంట గ్రామంలో విక్రమసింహపురి విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ శిబిరంలో బాగంగా గురువారం క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. నెల్లూరుకు చెందిన హోమిబాబా క్యాన్సర్ ఆసుపత్రి, పరిశోధనా సంస్థ వైద్యులు వై. ప్రదీప్, ఏ. రాజేష్, సీనియర్ రెసిడెంట్ వి.జీవన్ క్రాంతికుమార్‌లు పాల్గొన్నారు. స్త్రీలు, పురుషుల్లో వచ్చే పలురకాల క్యాన్సర్‌లు గురించి తెలియజేశారు. క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి, వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. ధూమపానం, మద్యపానంకు దూరంగా ఉంటే పురుషులు కొన్ని క్యాన్సర్లు రాకుండా చూసుకోవచ్చునన్నారు. అనంతరం నెల్లూరు కోర్టు న్యాయవాది దాసరి ప్రసాద్ గౌడ్ పోక్సో చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా. బి. వెంకటసుబ్బారెడ్డి, క్యాన్సర్ ఆసుపత్రి మెడికో, సోషల్‌వర్కర్ సుశీల, విద్యార్థులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేత

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఏళ్ళ తరబడి వున్న ప్రజలకు నీడనిచ్చే చెట్లు నరికేసి, ఆ చెట్లను కార్యాలయ ప్రహరీగోడపై వేయడంతో ప్రహరీ కూలిపోయింది. ఈమేరకు చెట్లు నరికేసిన మల్లికార్జున అనే వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీఓ మంజులమ్మ తెలిపారు. ఎస్సీ బాలుర హాస్టల్ ప్రాంతంలోని పోలీస్ క్వార్టర్స్ ప్రాంతంలోని చెట్లు కూల్చేయడంపై స్థానికంగా విమర్శలకు తావిచ్చింది.

స్పోర్ట్స్ మీట్ బ్రోచర్ ఆవిష్కరణ

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): బుచ్చి ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ అపస్మా అధ్వర్యంలో జిల్లా స్థాయిలో మనోహర్‌రెడ్డి ట్రస్ట్ సహకారంతో క్రీడా పోటీలను ఈనెల 29 కోవూరు నియోజకవర్గం స్థాయిలో రేబాలలోని సెయింట్ థామస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో, డిసెంబర్ 13న నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహణకు ఎంఈఓలు దిలీప్‌కుమార్, పీవీ.రత్నం గురువారం అపస్మా సభ్యులతో బ్రోచర్ ఆవిష్కరించారు. ఎంఈఓ కార్యాలయం వద్ద నిర్వహించిన బ్రోచర్ ఆవిష్కరణలో జిల్లా అధ్యక్షుడు నేలనూతల శ్రీధర్, అపస్మా అధ్యక్ష, కార్యదర్శులు రామసుబ్బారెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, అయూబ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

శిథిలమైన బస్టాండ్లను బాగుచేస్తాం

● ఆర్టీసీ ఆర్ఎం షమీమ్



ఆర్టీసీ బస్టాండును పరిశీలిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం షమీమ్

మనుబోలు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దెబ్బతిని, శిథిలావస్థకు చేరిన బస్టాండ్లను బాగుచేసి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని నెల్లూరు ఆర్టీసీ ఆర్ఎం. షమీమ్ తెలిపారు. ఆమె గురువారం మనుబోలులో పాడుబడిఉన్న ఆర్టీసీ బస్టాండును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనుబోలులో ఆర్టీసీకి 20 సెంట్ల స్థలం ఉందన్నారు. అయితే పంచాయతీ అధికారులు సచివాలయం పక్కన సామాజిక మరుగుదొడ్లు నిర్మాణం చేసే సమయంలో 3అడుగులు ఆక్రమించేశారన్నారు. దీనిపై ఆ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. అలాగే మిగతా స్థలం ఆక్రమణలకు గురికాకుండా ఫెన్సింగ్ వేయాలని సిబ్బందికి సూచించామన్నారు. జిల్లాలో వింజమూరు,బుచ్చి, ఉలవపాడు, మనుబోలు ఇలా ఏడు బస్టాండ్ల వరకు దెబ్బతిని ఉన్నాయన్నారు. ఫ్లోరింగ్, రంగులు వేసి సిద్దం చేయడమా,లేదా ప్రైవేటు వ్యక్తులకు స్థలం లీజుకు ఇవ్వడమా ఆలోచిస్తామన్నారు. ఇకనుంచి ఆర్టీసీ బస్సులు నిర్దేశించిన పాయింట్‌లోనే ఆపుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిఈ ఫయాజ్, ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



అభయాంజనేయస్వామి ప్రతిష్ఠ

ఇందుకూరుపేట, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని జగదేవిపేట నల్లల దిబ్బ గ్రామంలో అభయాంజనే యస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా జరిగింది. వేద పండితులు నారాయణస్వామి శ్రీనివాసశర్మ, సతీష్ స్వామి ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు జరిపి బుధవారం రాత్రి స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించి గురువారం ఉదయం రామనామ స్మరణలతో అభయాంజనేయస్వామిని అత్యంత వైభవంగా ప్రతిష్టించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలను సేకరించారు. అన్న దానం నిర్వహించారు.

ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేయాలి

ఉదయగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంత మైన ఉదయగిరిని రెవెన్యూ డివిజన్‌గా చేసి అభివృద్ధికి నాంది పలకాలని జిల్లా సాధ న సమితి అధ్యక్షుడు డాక్టర్ కె వేణుగోపాల్ కోరారు. గురు వారం ఉదయగిరి రెవెన్యూ డివిజన్ సాధన సమితి ఆధ్వ ర్యంలో నాయకులు, సీనియర్ సిటిజన్లు, ప్రజాసంఘాలు, విద్యార్థులతో కలిసి పట్టణం లోని రంగనాయకుల ఆలయం నుంచి మెయిన్ బజార్ గుండా పంచాయతీ బస్టాండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పంచా యతీ బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ అనాదిగా ఉదయగిరి ప్రాంతం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి, పాలకుల వివక్షకు గురవుతోంద న్నారు. ఉదయగిరిని జిల్లా చేయాలని ఆరున్న రేళ్లుగా ఉద్యమాలు చేస్తున్నామన్నారు. కనీసం రెవెన్యూ డివిజన్ అయినా అవుతుందని తమ తపన అన్నారు. జిల్లాలో అతిపెద్ద నియోజక వర్గమైన ఉదయగిరిని రాష్ట్ర ప్రభుత్వం కావలి రెవెన్యూ డివిజన్‌లో కలపాలని చూడ డం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ద్వారా ప్రభుత్వానికి తమ ప్రాంత స్థితిగతులను వివరిస్తామని, అప్పటికైనా ప్రభుత్వం కళ్లుతెరిచి ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేయాలన్నారు. లేదంటే డివిజన్ కోసం దశల వారీగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ ఎన్ వెంకటరావు తన సి బ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో విశ్రాంత డీఎంహెచ్‌వో మాశిలా మణి, యూడీఎఫ్ ప్రతినిధులు ఖాజా, శ్రీరామ చంద్రమూర్తి, జిల్లా సాధన సమితి నాయకులు దస్తగిరిఅహ్మద్ పాల్గొన్నారు.

కారు ఢీకొని గేదె మృతి

కలిగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెదకొండూరు వద్ద గురువారం రాత్రి కారు ఢీకొని గేదె మృతి చెందింది. గుంటూరు నుంచి ఆత్మకూరుకు వెళ్తున్న కారు ఢీకొనడంతో ద్రోణాదుల వెంకటేశ్వర్లు అనే రైతుకు చెందిన గేదె మృతి చెందింది. గేదె ఖరీదు సుమారు రూ. 1 లక్ష ఉంటుందని బాధితులు కన్నీరు మున్నీరయ్యారు. ఇదిలా ఉండగా కారులో ప్రయాణిస్తున్నవారు ఆత్మకూరు చెందిన బట్టేపాడు వాసులని తెలిసింది. కారులో ఉన్న ఇద్దరు గాయపడగా వారిని కలిగిరి ప్రవేటు వైద్యశాలకు తరలిం చారు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ ఉమాశంకర్ తెలిపారు.

C.R.I.M.E N.E.W.S

పెంచలకోనలో తలనీలాల చోరీ

రాపూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోనలో తలనీలాలు చోరీ అయిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఆలయ అధికారులు తెలిపిన వివరాల మేరకు సాయంత్రం 7.30 గంటల ప్రాంతంలో కళ్యాణ కట్ట మూసివేసిన తర్వాత అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను దేవస్థానం సిబ్బంది గమనించారు. వారిని అడ్డుకుని ప్రశ్నించడంతో వారు తమవద్ద ఉన్న బ్యాగును అక్కడే వదిలి పారిపోయారు. ఆ రెండు బ్యాగులను పరిశీలించగా ఒక బ్యాగులో తలనీలాలు, మరొక బ్యాగులో రశీదు కనిపించాయి. ఆలయ అధికారులు వెంటనే పెంచలకోన టూరిస్టు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బలిజ అన్నదానం సత్రంలో దాక్కొని ఉన్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయాన్ని తలనీలాల లైసెన్స్‌దారుడు కత్తుల యాదగిరికి తెలియజేయగా, టూరిస్ట్ పోలీసుల కస్టడీలో ఉన్న ముగ్గురు వ్యక్తులు ఎస్ మోహన్‌రాజ్, హరి, మోహన్‌గా గుర్తించారు. వారు ఇదివరకు కోనలోని తలనీలాల సేకరణ విభాగంలో గతంలో పని చేసిన సిబ్బంది అని తెలిపారు. ప్రస్తుతం వీరు పని చేయడం లేదని తెలిపారు. అందకుముందు ఇక్కడ పని చేసే సమయంలో అదనపు తాళాలు సమకూర్చుకుని, ఈ చోరీకి యత్నించినట్లు తెలిపారు. ఈ సంఘటనపై రాపూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని పోలీసు అధికారులను కోరామని ఆలయ ఉప కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

● రేణుకా ఎల్లమ్మతల్లి ఆలయంలో..

దుత్తలూరు (ఉదయగిరి, ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ పంచాయతీ గుదేవారిపాళెంలో ఉన్న రేణుకా ఎల్లమ్మతల్లి ఆలయంలో గురువారం పట్టపగలే చోరీ జరిగింది. వివరాల మేరకు.. గుర్తుతెలియని వ్యక్తులు మధ్యాహ్న సమయంలో ఆలయంలోకి ప్రవేశించి అక్కడ ఏర్పాటుచేసిన హుండీని ఎత్తుకెళ్లారు. సమీపాన ఉన్న తోటలో హుండీని ధ్వంసం చేస్తుండగా చుట్టుపక్కల ఉన్న ప్రజలు శబ్దాలు విని కేకలు వేయడంతో అందులో ఉన్న నగదు తీసుకుని అక్కడ నుంచి పరారయ్యారు. హుండీలో సుమారు రూ. 20 వేలు నగదు ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ ఆదిలక్ష్మి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఆత్మకూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆత్మకూరు పట్టణ సమీపంలోని జాలయనగరం సమీపంలో ఉన్న ఎస్ఎస్ డాబా సమీపంలో గురువారం అర్థరాత్రి జరిగింది. ఆత్మకూరు వైపు నుంచి సంగం వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం రోడ్డుపై వాటర్ బాటిల్స్ ఏరుకుంటూ వెళుతున్న వ్యక్తిని వెనుక నుంచి ఢీ కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతిచెందినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. మృతదేహం పూర్తిగా ఛిద్రం కావడంతో మృతుని వివరాలు తెలియలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ జిలాని తెలిపారు.

● రైలు ఢీకొని యువకుడు..



పెయ్యల శ్రీనివాసులు (ఫైల్)

కోవూరు, నవంబరు 13, (ఆంధ్రజ్యోతి): పడుగుపాడు రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం రైల్వేలైను దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో కోవూరు రైల్వేరోడ్డు ప్రాంతానికి చెందిన పెయ్యల శ్రీనివాసులు (27) అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వేరోడ్డు నుంచి కావలి- నెల్లూరు రోడ్డు చేరుకునేందుకు రైల్వే ట్రాక్ దాటుతుండగా వేగంగా వచ్చి రైలు ఢీకొనడంతో మృతి చెందినట్లు రైల్వే పోలీసులు భావిస్తున్నారు. కావలి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్ట్

రాపూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని గోనుపల్లి శివారులో పేకాట స్థావరంపై పోలీసులు గురువారం ఆకస్మికంగా దాడి చేశారు. స్థానిక వ్యవసాయ భూమి శివారులో జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించి, ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వెంకట రాజేష్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 20,100 నగదు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డిప్లమో విద్యార్థి అదృశ్యం

నెల్లూరు(క్రైం), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): డిప్లమో చదువుతున్న విద్యార్థి అదృశ్యంపై చిన్నబజారు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని మూలాపేట వాకర్స్‌రోడ్డులో మల్లికార్జున, సుజాత దంపతులు నివసిస్తున్నారు. మల్లికార్జున కార్పెంటర్‌గా, సుజాత టైలరింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు హర్షవర్ధన్ గీతాంజలి కళాశాలలో డిప్లమో చివరి సంవత్సరం చదువుతున్నాడు. రోజూ లానే ఈ నెల 11వ తేదీ ఉదయం కళాశాలకు వెళ్లి మధ్యాహ్నం 1.30 గంటలకు తిరిగి ఇంటికి వచ్చాడు. ఆ తర్వాత 3.30 గంటల సమయంలో బయటకు వెళ్లి వస్తానని ఇంట్లో వారికి చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించినా ప్రయోజనం లేక చిన్న బజారు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమార్తె మరణంపై అనుమానం

నెల్లూరు(క్రైం), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తన కుమార్తె మరణంపై అనుమానం ఉందని ఓ తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో చిన్నబజారు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని బీవీనగర్‌కు చెందిన అబ్దుల్ హఫీజ్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ ప్రస్తుతం నెల్లూరులో ఉంటూ వర్క్‌ఫ్రమ్ హోమ్ చేస్తున్నారు. ఆయనకు 2019లో నిజామాబాద్‌కు చెందిన ఆయిషా కౌసర్‌తో వివాహమైంది. వారికి ఆలియా మేహ్రీన్, జైన్ మేహ్రీన్ అని ఇద్దరు కుమార్తెలు. గతేడాది ఆగస్టులో కౌసర్ ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. అనంతరం హఫీజ్ మేనత్త గుల్షన్ కుమార్తె రోషినిని రెండో వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి ఇద్దరు పిల్లలను మేనత్త వద్దే ఉంచాడు. ఈ నెల 12వ తేదీ పెద్ద కుమార్తె ఆలియా మేహ్రీన్ బాత్‌రూమ్‌లో పడిపోయి ఉందని ఫోన్ రావడంతో హఫీజ్ హుటాహుటిన మేనత్త ఇంటికి చేరుకున్నాడు. కుమార్తె మాట్లాడలేని స్థితిలో ఉండటంతో ప్రైవేటు వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందిందని తెలిపారు. ఈ విషయాన్ని హఫీజ్ విజయవాడలోని మొదటి భార్య తల్లిదండ్రులకు తెలిపాడు. విషయం తెలుసుకున్న మొదటి భార్య మేనమామ జావిద్ ఆలియా మేహ్రీన్ మరణంపై అనుమానాలు ఉన్నాయని 112 నెంబరుకు ఫోన్ చేసి తెలిపాడు. ఈ క్రమంలో తన కుమార్తె మరణంపై అనుమానాలు ఉన్నాయని హఫీజ్‌కు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త వేధింపులపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులపై భార్య ఇచ్చిన ఫిర్యాదుతో నవాబుపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని శెట్టిగుంటరోడ్డు సమీపంలో బల్లెం సందీప్, శ్వేత దంపతులు నివసిస్తున్నారు. వారు 2008లో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆ దంపతులకు ఇద్దరు పిల్లలు కలిగారు. భర్త మరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని శ్వేత నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	266
కోడిగుడ్ల ధర (100): 600	



వాహనదారులకు అవగాహన సదస్సులు

నెల్లూరు(క్రైం), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎస్పీ అజిత ఆదేశాల మేరకు గురువారం రాత్రి జిల్లా వ్యాప్తంగా పోలీసులు వాహనదారులకు రోడ్డు నిబంధనలు, చట్టాలపై అవగాహన కల్పించారు. నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో చిన్నబజారు పోలీసు స్టేషన్ ఎస్‌ఐ కిషోర్‌బాబు, రంగనాయకులపేటలోని పెన్నా బ్యారేజ్ వద్ద సంతపేట పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సోమయ్య, ఆత్మకూరు బస్టాండు వద్ద నార్త్‌ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ వాహనదారులు, ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు.

అండర్ పాస్‌కు ఉత్తర్వుల జారీ

● ఎంపీ వేమిరెడ్డికి ధన్యవాదాలు : కేతంరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కృషితో చింతారెడ్డిపాళెం కూడలి వద్ద వెహికల్ అండర్‌పాస్ మంజూరైందని తెలుగుదేశం పార్టీ నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. దీని నిర్మాణానికి సంబంధించి ఎన్‌హెచ్‌ఏఐ ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. వెహికల్ అండర్ పాస్ ఏర్పాటుతో స్థానిక ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని, రహదారి ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. అండర్‌పాస్ మంజూరుకు కారకులైన సీఎం చంద్రబాబు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నేడు శ్రీవారికి కార్తీక మాస అభిషేకాలు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వికాస్ ప్రజాహిత సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామికి శుక్రవార అభిషేక మహోత్సవం జరుగుతుందని సేవా సమితి అధ్యక్షుడు, 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాపరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం బాలాజీనగర్ సీతారామ స్వామి మందిరంలో జరుగుతుందని తెలిపారు. ముందుగా మరకత గణపతికి అభిషేకం, అనంతరం శ్రీవారికి అభిషేకం, పుష్పయాగం నిర్వహిస్తామని చెప్పారు.

రేపు సినీ నటుడు కృష్ణ వర్ధంతి

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రఖ్యాత సినీ నటుడు కృష్ణ మూడవ వర్ధంతిని శనివారం ఉదయం నెల్లూరు మినీ టౌన్ హాలులో నిర్వహిస్తున్నట్లు సృజన సాహితీ సంస్థ వ్యవస్థాపకుడు దగ్గుపాటి రాధాకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ నటించిన చలన చిత్రాల్లోని సినీ గీతాలతో సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే కొందరు సింహపురి ప్రతిభావంతులకు ఆత్మీయ సత్కారాలు జరుగుతాయని తెలిపారు.

రేపు పెన్షనర్స్ సమావేశం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం ఉదయం 9.30 గంటలకు భక్తవత్సలనగర్ పెన్షన్ భవనంలో జరుగుతుందని ఆ సంఘం అధ్యక్షుడు ఎస్ఎం గౌస్, ప్రధాన కార్యదర్శి ఎస్‌వీఎస్ మూర్తి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిసెంబరు 17న జరుప తలపెట్టిన జాతీయ పెన్షనర్స్ దినోత్సవంపై చర్చిస్తామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీ బకాయిలపై చర్చించి ప్రభుత్వానికి తమ డిమాండ్లు తెలియజేస్తామన్నారు.

రేపు ఆధ్యాత్మిక ప్రవచనం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో శనివారం శివతత్వం - కార్తీక మాసం అనే అంశంపై బొగ్గవరపు రాధాకృష్ణమూర్తి ఆధ్యాత్మిక ప్రవచనం జరుగుతుందని ఆ సంస్థ కార్యదర్శి వై శేషగిరీశం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం టౌనుహాలులోని వర్ధమాన సమాజం ఆధ్వర్యంలో సాయంత్రం 6.30 గంటలకు జరుగుతుందని తెలిపారు. నగరవాసులు పాల్గొనాలని కోరారు.

ఒక కుటుంబంలోని వారి ఓట్లు ఒకే కేంద్రంలో ఉండాలి



ఓటరు నమోదుపై ప్రసంగిస్తున్న కమిషనర్

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఓటర్ల జాబితా సవరణలో భాగంగా కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా బీఎల్‌వోలు జాగ్రత్తలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ వై నందన్ ఆదేశించారు. గురువారం నగరంలోని కస్తూరిబా కళాక్షేత్రంలో నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గాలకు సంబంధించి ఈఆర్‌వోలు, అసిస్టెంట్ ఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు, బూత్‌లెవల్ అధికారులతో రాష్ట్ర ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కమిషనర్‌తోపాటు నెల్లూరు ఆర్డీవో అనూష ఇందులో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో వచ్చిన ఓటర్ల దరఖాస్తులపై పారదర్శకంగా విచారించాలని యంత్రాంగాన్ని కోరారు.

నీటి యాజమాన్యం ఎలా!?

(5వ పేజీ తరువాయి)

చాలా కాలం నుంచి జిల్లాలో శిస్తు వసూలు జరగడం లేదు. సాగునీటి సంఘాలు లేకపోవడంతో శిస్తు వసూళ్లను ఎవరూ పట్టించుకోలేదు. సుమారు రూ.50 కోట్ల వరకూ జిల్లాలో శిస్తు వసూళ్లు జరగాల్సి ఉంది. అయితే గతేడాది సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిగి పాలకవర్గాలు రావడంతో శిస్తు వసూళ్లపై దృష్టి పెట్టారు. రైతులు కూడా శిస్తు చెల్లించేందుకు ముందుకొస్తున్నారు. కానీ కట్టించుకునేవారు కరువయ్యారు. శిస్తు పన్ను కట్టించుకునే వెబ్‌సైట్ పనిచేయడం లేదని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. మాన్యువల్‌గా కట్టించుకునేందుకు నిరాకరిస్తున్నారు.

సుందరయ్య కాలనీ వద్ద అండర్‌పాస్ నిర్మించాలి

● జాతీయ రహదారిపై సీపీఎం ఆందోళన



హైవే వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

నెల్లూరు (వైద్యం), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సుందరయ్య కాలనీ జాతీయ రహదారి వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలంటూ సీపీఎం నాయకులు ఆందోళన చేపట్టారు. గురువారం సుందరయ్య కాలనీ జాతీయ రహదారి వద్ద ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు, నెల్లూరు రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ మాట్లాడారు. ఆ ప్రాంతం లో బాక్స్ టైప్ బ్రిడ్జి లేకపోవటం వల్ల ప్రమాదాలు జరిగి అనేక మంది మృత్యువాత పడ్డారన్నారు. భారత జవాన్లు కూడా మృతి చెందారని తెలిపారు. ఈ ప్రాంతంలో పడారుపల్లి, ఆర్‌డీటీ కాలనీ, కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు, ఇందిరమ్మ కాలనీ వంటి వాటిలో 5 వేల కుటుంబాలు నివసిస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెంచల నర్సయ్య, సతీష్, సుధీర్, కండే కోటేశ్వరరావు, సురేష్, వీర్ల శ్రీనివాసులు, చైతన్య, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

పది రోజుల్లో పెన్నా పొర్లుకట్ట పనులు పూర్తి

● టీడీపీ నాయకుడు గిరిధర్‌రెడ్డి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : పెన్నా పరీవాహక ప్రాంతాల వారికి వరద ప్రమాదాలు తలెత్తకుండా ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న పెన్నా కరకట్టల పనులు మరో పది రోజుల్లో పూర్తి చేస్తామని టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. పొట్టేపాళెం వద్ద జరుగుతున్న కరకట్టల పనులను గురువారం వేదగిరి దేవస్థానం చైర్మన్ ఇందుపూరు అచ్యుత్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. భారీ వర్షాలు, తుపాన్లు సంభవించినప్పుడు నదీ తీర ప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారన్నారు. కరకట్టల ఆధునికీకరణ, నూతన నిర్మాణాలతో ఇక ఆ పరిస్థితి ఉండదని చెప్పారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, టీడీపీ నాయకులు శ్రీనివాసులు రెడ్డి, వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చేసిన మేలు మరువలేనిది

● జిల్లా మైనార్టీ నాయకులు మొయినుద్దీన్, సాబీర్‌ఖాన్



మాట్లాడుతున్న మైనార్టీ నేత మొయినుద్దీన్

నెల్లూరు (వైద్యం), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చంద్రబాబు ముస్లిం సమాజానికి చేసిన మేలు మరువలేనిదని టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మొయినుద్దీన్, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి సాబీర్‌ఖాన్ వెల్లడించారు. గురువారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాలు విడుదల చేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. ఇందుకు కృషి చేసిన మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అలాగే అజీజ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 28 ప్రదేశాలలో ముస్లింల కోసం స్కిల్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జహీర్, నౌషాద్, జాఫర్, పాషా, మొహిద్దీన్, అబ్దుల్ అజీజ్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా స్టేషన్ డీఎస్పీ సస్పెన్షన్

నెల్లూరు(క్రైం,ఆంధ్రజ్యోతి): మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ చెంచు రామారావును సస్పెండ్ చేస్తూ గురువారం రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. ఓ కేసులో నగదు తీసుకున్నారన్న అభియోగం నేపథ్యంలో ఆయనను సస్పెండ్ చేశారు.

మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

● సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బయ్య



చలో విజయవాడ గోడపత్రికను విడుదల చేస్తున్న పందిటి సుబ్బయ్య తదితరులు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం నగరంలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఆయన పలు మదిగ సంఘాల నాయకులతో కలిసి చలో విజయవాడ కార్యక్రమ గోడపత్రికను ఆవిష్కరించారు. చిత్తూరు జిల్లా నుంచి నెల్లూరు జిల్లా వరకు మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత లేదన్నారు. తెలుగుదేశం పార్టీ తప్పకుండా జిల్లాలోని మాదిగలకు న్యాయం చేస్తుందని ఆశిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణకు చట్టం చేసి మాదిగ, ఉపకులాలకు సామాజిక న్యాయం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాదిగ జాతి తరపున కృతజ్ఞతలు తెలుపడానికి డిసెంబరు 4న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని మాదగలంతా పాల్గొనాలని కోరారు. విలేకరుల సమావేశంలో మన ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పల్లాల శ్రీనివాసులు, నాయకులు కుడుముల సుబ్బారావు, కువ్వారపు నాగేశ్వరరావు, సాల్మన్, తాటిపర్తి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతి సోమశేఖర్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల్లో ఎస్సీ, ఎస్టీల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ జాయింట్ యాక్షన్ కమిటీ గౌరవాధ్యక్షుడు జ్యోతి సోమశేఖర వరప్రసాద్ అధికారులను కోరారు. గురువారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ నివేదికను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీల అత్యాచార నిరోధక చట్టం -1989 కింద వచ్చే హక్కుల పరిరక్షణ, దళితుల ఆత్మగౌరవం దృష్టిలో ఉంచుకొని శుక్రవారం ఉదయం 10 గంటలకు అంబేడ్కర్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. విలేకరుల సమావేశంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వాదనాల వెంకటరమణ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ మాజీ సభ్యుడు కొప్పాల రఘు, యానాది రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కుడుముల సుబ్బారావు పాల్గొన్నారు.

17న చలో ఢిల్లీ : అంబేడ్కర్ మాదిగ



నెల్లూరు(హరనాథపురం), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు సీజేఐపై దాడికి యత్నించడాన్ని నిరసిస్తూ ఈనెల 17న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్ మాదిగ చెప్పారు. గురువారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో చలో ఢిల్లీ కార్యక్రమ గోడ పత్రికలను ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయ్‌కృష్ణ మాదిగ, నాయకులతో కలిసి ఆవిష్కరించారు. సీజేఐ గవాయ్‌పై గత నెల 6న దాడి యత్నం జరిగితే నిందితుడిని ఇంతవరకు అరెస్ట్ చేయలేదన్నారు. విలేకరుల సమావేశంలో ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు గోచిపాతల వెంకటేశ్వర్లు మాదిగ, ఎంఈఎఫ్ నాయకుడు బెజవాడ పాపయ్య, వేగూరు వెంకటేశ్వర్లు, ఎంఎస్పీ మహిళా ఇన్‌చార్జి జానకిమాల తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడ వరకు రోడ్డు ఆక్రమణ!



నెల్లూరు - పొదకూరు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా అధికారులు రహదారి ఆక్రమణలను తొలగిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం కొత్తూరు హెచ్‌ఆర్ కల్యాణ మండపం ప్రాంతంలో కార్పొరేషన్ అధికారులు అక్రమ కట్టడాల తొలగింపునకు మార్కింగ్ వచ్చారు. ఈ రహదారిని 80 నుంచి 100 అడుగుల వరకు విస్తరిస్తున్నారు. ఇందుకోసం అనేక ఆక్రమిత కట్టడాలను తొలగిస్తున్నారు.

- నెల్లూరు(సిటీ,ఆంధ్రజ్యోతి)

మూలస్థానేశ్వరాలయంలో పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలస్థానేశ్వరాలయంలో కార్తీక మాస పూజలు కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, మూలవర్లకు అన్నాభిషేకం జరిగాయి. భువనేశ్వరి అమ్మవారికి విశేష అలంకారం పూజలు జరిగాయి. నారాయణ విద్యా సంస్థ జీఎం వేమిరెడ్డి భాస్కర్‌రెడ్డి పాల్గొని విశేష పూజలు చేశారు. రాత్రి శివపార్వతులకు ప్రాకారోత్సవం జరిగింది. ఈవో శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

టీడీపీలో చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే

నెల్లూరు రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలం కొత్తవెల్లంటి గ్రామానికి చెందిన పలువురు గురువారం ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. శివకుమార్‌రెడ్డి, శ్రీహరి, రమేష్‌రెడ్డి మిత్రబృందానికి ఎమ్మెల్యే కండువా కప్పిన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రూ. 1.50 కోట్లతో 52వ డివిజన్ అభివృద్ధి : రూప్‌కుమార్

నెల్లూరు(సిటీ), నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : నగరంలోని 52వ డివిజన్‌ను ఇప్పటి వరకు రూ.1.50 కోట్లతో అభివృద్ధి చేసినట్లు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తెలిపారు. ఆ డివిజన్‌లో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆయన గురువారం స్థానిక కార్పొరేటర్ అస్మా మైనుద్దీన్‌తో కలిసి పర్యవేక్షించారు. సిటీలో మంత్రి నారాయణ అభివృద్ధి పనులను పరుగులు తీయిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకయ్య యాదవ్, పాషా మొహిద్దీన్, ఇక్బాల్ పాల్గొన్నారు.



యూజీడీ పనులను పరిశీలిస్తున్న రూప్‌కుమార్

16న కార్తీక వనభోజన మహోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 16న నగరంలోని పడారుపల్లి గంగమ్మ ఆలయంలో కార్తీక మాస వనభోజన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు విరవు లలితారామ్ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. వనభోజన కార్యక్రమంలో మహిళలు, చిన్నారులకు ఆటలు, పాటలు, వక్తృత్వ, ముగ్గుల పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వనభోజన మహోత్సవ పోస్టర్లు ఆవిష్కరించారు.



వనభోజన మహోత్సవం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

పబ్లిక్ నోటీస్

ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా M/s. క్రిష్ణా మైనింగ్ కంపెనీ వారు నెల్లూరు డివిజన్ కంపార్ట్‌మెంట్ నెం.107& 108లో 10.02 హెక్టార్ల అటవీ భూమిని ఫల్స్‌ఫర్, క్వార్ట్జ్ మరియు మైకా మైనింగ్ చేయుటకు అటవీ భూమి యొక్క మళ్లింపునకు భారత ప్రభుత్వము పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మంత్రిత్వశాఖ IRO, విజయవాడ వారు తేది. 30-10-2024 లేఖ సంఖ్య 4-APC 137/2021-VIJ /498 మరియు అటవీ శాస్త్ర మరియు సాంకేతిక శాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి ఆర్డరు సంఖ్య 64 EFS &T (Sec-11) Dept. తేది.03-11-2025 ద్వారా అటవీ భూమి మళ్లింపు ఉత్తర్వులు ఇవ్వబడినవి. అనుమతి ప్రతులు www.parivesh.nic.in మరియు www.goir.ap.gov.in నందు లభించును.

ఇట్లు: **జి.భరత్,** మేనేజింగ్ పార్టనర్
క్రిష్ణామైనింగ్ కంపెనీ, గూడూరు-524406

డాక్యుమెంట్ పోయినది

నా క్లయింట్ అయిన **M/s. Padma Enterprises Rep by** బత్తన పద్మ భర్త గాలి సంధీప్, ప్లాటు నెం.202, DRK గోల్డెన్ పామ్స్ అపార్టుమెంటు, గాంధీనగర్, నీళ్ళ ట్యాంక్ ప్రక్కన, జె.కె.కాలని, వేదాయపాళెం, నెల్లూరు. యావన్మందికి తెలియజేయడం ఏమనగా **ఒరిజినల్ సేల్ అగ్రిమెంటు డాక్యుమెంటు నెం. 2598/ 2020 తేది:18-11-2020 SRO కోవూరు** సంబంధించిన తేది.05-11-2025న నా క్లయింట్ ఇంటి వద్ద నుండి వేదాయపాళెం సెంటర్‌కు జెరాక్స్ కొరకు తీసుకొని ఆటోలో పోవుచుండగా మార్గమధ్యలో జారి పడిపోయినది. ఈ ఒరిజినల్ సేల్ అగ్రిమెంటు ఎవ్వరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకు తెచ్చి ఇచ్చిన వారికి తగిన పారితోషికం పొందగలరు.

బద్దెపూడి రవీంద్ర, M.A., B.L.,
అడ్వకేట్, బార్కస్ స్టేట్‌బ్యాంకు ఎదురుగా,
నెల్లూరు. సెల్: 98668 94519

వ్యవసాయ మార్కెట్ కమిటీ నెల్లూరు
శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా

ఆర్.సి.నెం.74/2025 తేది:13-11-2025

టెండరు నోటీసు

శ్రీ ఎ.సి. సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ యార్డు, ప్రక్కన నూతనముగా ఏర్పాటు చేయబడిన కోనేరు పండ్ల మార్కెట్ మరియు ప్రధాన కార్యాలయముల లోపల, చుట్టు ప్రక్కల, అన్ని గేట్ల ముంగిట మరియు పరిసర ప్రాంతముల యందు పడిన చెత్త చెదారములను, మట్టి, దుమ్ము, ధూళి మొదలగు వాటిని ప్రతి దినము శుభ్ర పరిచి సమస్యలు లేని దూర ప్రాంతములకు తరలించుట మరియు వారమునకు ఒక పర్యాయము సదరు శుభ్ర పరచిన ప్రదేశముల యందు బ్లీచింగ్ పౌండర్ చల్లుటకు ఒక నెలకు అగు రేటును సీల్డు టెండర్ల ద్వారా కోరబడుచున్నవి. టెండరు షెడ్యూల్ కొరకు ఉన్నత శ్రేణి కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటీ, నెల్లూరు (కూరగాయల మార్కెట్, మద్రాసు బస్టాండు) వారి కార్యాలయములో రూ.500/-లు చెల్లించి తేది:14-11-2025 ఉదయము 10.30 గంటల నుండి తేది:20-11-2025 సాయంకాలం 05.00 గంటల వరకు పొందవచ్చును. సీలు వేసిన టెండర్లును తేది:21-11-2025 మధ్యాహ్నము 12.00 గంటల వరకు స్వీకరించబడును. టెండర్లను తేది:21-11-2025 మధ్యాహ్నము 3.00 గంటలకు సదరు టెండరుదారుల సమక్షములో తెరువబడును.

యం.శ్రీనివాసులు
ఉన్నత శ్రేణి కార్యదర్శి
వ్యవసాయ మార్కెట్ కమిటీ, నెల్లూరు

యం.శ్రీధర్‌రెడ్డి
చైర్మన్
వ్యవసాయ మార్కెట్ కమిటీ, నెల్లూరు





నగరంలో వాన

వాతావరణ ప్రతికూలతతో రెండు, మూడు రోజులుగా చలిగాలులు వీస్తున్నాయి. దీనికితోడు గురువారం నెల్లూరు నగరంలో అక్కడక్కడా వర్షం కురిసింది. ఉదయం నుంచి మబ్బులు కమ్మేశాయి. ఆ తర్వాత చిరుజల్లులతో కూడిన వాన పడటంతో నగర వాసులు కాస్త అసౌకర్యాన్నికి గురయ్యారు. చలి కూడా ఉండటంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)



నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్నీ గ్రంథాలయాల్లో శుక్రవారం నుంచి వారోత్సవాలు జరగనున్నాయి. నెల్లూరులోని రేబాల వారివీధిలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని వారం రోజులు నిర్వహించే వివిధ కార్యక్రమాల బ్రోచర్లను గురువారం విడుదల చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కే కుమార్‌రాజా మాట్లాడుతూ విద్యార్థులు ఈ వారోత్సవాల్లో పాల్గొని వారి ప్రతిభను కనబరచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సతీష్ కుమార్, లైబ్రేరియన్ సునీత, జితేంద్ర, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా నవీకరణకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో మురళి

ఉదయగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తప్పుల తడకలు లేని స్వచ్ఛమైన ఓటరు జాబితా నవీకరణకు అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మురళి కోరారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల తహసీల్దారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషనలైజేషన్ ప్రక్రియలో భాగంగా వింజమూరు మండలం కాటేపల్లి పోలింగ్ కేంద్రం-143ను వన్నూరప్పపాళెంకు మార్చేందుకు ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. మ్యాపింగ్ ప్రక్రియలో భాగంగా 2025 ఓటర్ల జాబితాను 2002 ఓటర్ల జాబితాతో సరిచూసే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ నీహా, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు కాంతారావు

నెల్లూరు (హరనాథపురం) నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి. కాంతారావు అధికారులను హెచ్చరించారు. గురువారం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహానికి చేరుకున్న కాంతారావుకు జేసీ మొగిలి వెంకటేశ్వర్లు పుష్పగుచ్ఛం అందచేసి స్వాగతం పలికారు. అనంతరం ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేసి అరకేజీ చక్కెర ప్యాకెట్లలో చక్కెర తక్కువగా ఉండటాన్ని గుర్తించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. హమాలీలతో జీతాల విషయం మాట్లాడారు. ఇందిరాగాంధీ నగర్‌లోని రేషన్ షాపును తనిఖీ చేసి ఈపాస్ మిషన్‌లో సాంకేతిక లోపాలను గుర్తించారు. కార్డుదారులందరికీ ప్రభుత్వ నిబంధనల మేరకు బియ్యం, చక్కెర అందించాలని సూచించారు. దర్గామిట్టలోని గిరిజన సంక్షేమ హాస్టల్‌ను తనిఖీ చేసిన ఆయన గడువు ముగిసిన సాల్ట్ ప్యాకెట్లను గుర్తించి హాస్టల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోడిగుడ్ల బరువు తక్కువగా ఉందని గుర్తించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. మరుగుదొడ్లకు తలుపులు లేవని, శుభ్రంగా లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వివరించారు.

● అశ్రద్ధ వద్దు!

ఈ సందర్భంగా అధికారుల సమావేశంలో కాంతారావు మాట్లాడుతూ హాస్టళ్లలో విద్యార్థులకు అందించే ఆహారంలో అశ్రద్ధగా ఉన్నా, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోయినా ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. హాస్టళ్లకు సరఫరా అయ్యే వస్తువులను ముందుగా సరిచూసుకోవాలన్నారు. పౌరసరఫరాల విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులంతా సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్వో లీలారాణి, సివిల్ సప్లయిస్ డీఎం అర్జున్‌రావు, లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ ఐజాక్, జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మమ్మ, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ తదితరులు పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కాంతారావు



వలేటివారిపాలెంలో సాగవుతున్న కర్రపెండులం పంట, (ఇన్‌సర్ట్) అళ్వార్ గడ్డలు

అళ్వార్.. అదుర్స్!

ఆయనో ఆర్ఎంపీ డాక్టర్. కానీ వ్యవసాయం అంటే చాలా ఇష్టం. మూడేళ్లపాటు మినుము సాగు చేపట్టి బాగా నష్టపోయాడు. అయినా ఆశ చావని ఆయన కొత్తరకం పంట సాగు చేయాలని భావించాడు. అంతే తూర్పు గోదావరి జిల్లాలో విస్తారంగా సాగులో ఉన్న కర్రపెండలం (అళ్వార్ గడ్డ) సాగుపై ఆసక్తి పెంచుకున్నాడు. వెంటనే తన స్వగ్రామానికి చేరుకుని 80 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేపట్టాడు. తొలిసారిగా వలేటివారిపాళెంలో డాక్టర్ రెడ్డయ్య యాదవ్ సాగు చేసిన పంటను చూసేందుకు చుట్టుపక్కల రైతులు తరలివస్తున్నారు.

- వలేటివారిపాళెంలో కర్రపెండులం సాగు
- 80 ఎకరాల్లో పండిస్తున్న రైతు రెడ్డయ్య
- ఖర్చు తక్కువ.. లాభాలు ఎక్కువ

వలేటివారిపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెంలో రెడ్డెయ్య యాదవ్ ఆర్ఎంపీ డాక్టర్‌గా తన వృత్తి కొనసాగిస్తూనే వ్యవసాయంపై మక్కువతో కొత్త ఆలోచనలతో శ్రీకారం చుట్టారు. వరుసగా మూడేళ్ల మినుము సాగు చేసి తీవ్రంగా నష్టపోయారు. ఈ ప్రాంతంలోని ఎర్రరేగడి భూముల్లో వర్షంపై ఆధార పడి అధిక లాభాలు ఇచ్చే కొత్త రకం పంట సాగు చేయాలనే ఆలోచనతో తన మెదడుకు పదునుపెట్టారు. యూ ట్యూబ్ ద్వారా కొత్త పంటలు, వాటి లాభాలను తెలుసు కొని కర్రపెండలం పంట ఈ ప్రాంతానికి అనువుగా ఉంటుందని భావించారు. ఈ పంట ఎక్కువగా తూర్పుగోదావరి జిల్లాలో సాగు చేస్తున్నారని గ్రహించి, అక్కడకు వెళ్లారు. పంట సాగు, పెట్టుబడులు, దిగుబడులు, వచ్చే లాభాలను రైతులను అడిగి తెలుసుకొన్నారు. వెంటనే వలేటివారిపాలెంలో ఎర్రరేగడి భూములు 80 ఎకరాలను కౌలుకు తీసుకొని తూర్పుగోదావరి జిల్లా నుంచి కర్రపెండలం పంట సాగు చేసే కూలీలను తీసుకొచ్చారు. ఎకరాకు రూ.25 వేల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. దుక్కులు దున్నుకొని జూలై నెలలో కర్రపెండలం పంట సాగు చేపట్టారు తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాలకు వెళ్లి ట్రేలలో ఉన్న దుంపలను తెచ్చి నాటారు. నాటిన ఏడు నెలలకు పంట చేతికి వస్తుందని రైతు రెడ్డెయ్య యాదవ్ తెలిపారు. కర్రపెండలం దుంపలను తూర్పుగోదావరి జిల్లాలోని పెద్దాపురం, సామర్లకోట నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తారని, పలసాయాన్ని అక్కడి పరిశ్రమలకు తీసుకెళ్లి సగ్గుబియ్యం తయారీకి వినియోగిస్తారని తెలిపారు. సకాలంలో వర్షాలు కురిసి వాతావరణం అనుకూలిస్తే ఎకరానికి 80 నుంచి వంద క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని ఆయన వివరించారు. ఈ పంట సాగు చేస్తే అధిక లాభాలు వస్తాయని చెప్పుకొచ్చారు.



ఆర్ఎంపీ డాక్టర్, రైతు రెడ్డయ్య యాదవ్

16న స్విమ్మింగ్ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16న నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జూనియర్, సబ్‌జూనియర్ బాలబాలికల ఈత జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు సుంకర మధు, సనత్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారుల కు ఎస్ఎఫ్ఐ గుర్తింపు కార్డు ఉండాలని, గ్రూప్-1 విభాగంలో పోటీకి 2008, 09, 10 సంవత్సరాల్లో పుట్టిన వారై ఉండాలన్నారు. గ్రూప్-2లో 2011, 12 సంవత్సరాల్లో, గ్రూప్-3లో 2013, 14 సంవత్సరాల్లో పుట్టిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు వయసు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 9 గంటలకు హాజరై కోచ్ నాగరాజు వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

వెంకటేశ్వరపురం ఐటీఐలో 18న ఉద్యోగ మేళా

నెల్లూరు(విద్య), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఏపీ స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీస్, సీడాప్ సంయుక్తంగా ఈనెల 18వ తేదీన వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐలో ఉద్యోగమేళా నిర్వహిస్తు న్నట్లు ఆ ఐటీఐ ప్రిన్సిపాల్ కే శ్రీధర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లమో, ఐటీఐ పూర్తిచేసిన నిరుద్యోగ యువత ఈ మేళాలో పాల్గొనవచ్చన్నారు. 14 ప్రముఖ కంపెనీ లు హాజరై అర్హత కలిగిన యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తాయని తెలిపారు. ఆసక్తి గల వారు బయోడేటా, ఆధార్ కార్డుతో సంబంధిత తేదీ లో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని, మరిన్ని వివరాలకు నైపుణ్యం డాట్ ఏపీ డాట్ జీటీవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని కోరారు.

సింగపూర్ టూర్‌కు ముగ్గురు టీచర్ల ఎంపిక

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యా వ్యవస్థలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం సింగపూర్‌లో అమలు చేస్తున్న అధునాతన విద్యా విధానంపై అధ్యయనానికి జిల్లా నుంచి ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. బుచ్చిరెడ్డిపాళెంలోని పెనుబల్లి ఎంపీపీ మెయిన్ పాఠశాల నుంచి చీదరాల చెన్నయ్య, ఇందుకూరుపేట మండలంలోని ఎంకేఆర్ ఉన్నత పాఠశాల నుంచి డొమినిక్‌రెడ్డి, నరసాపురం జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ ముజీర్‌లు ఎంపికయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన 78 మందితో కలిసి వీరు ఈ నెల 27 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు సింగపూర్‌లో పర్యటించనున్నారు. అక్కడ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను సందర్శించి బోధన, అందులో నైపుణ్యం, బోధనేతర పద్ధతులు, కరికులం, తరగతి గదుల్లో వాతావరణం, క్రమశిక్షణ, విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య అనుబంధం, అనుసరిస్తున్న సాంకేతికత తదితర అంశాలపై వారు అధ్యయనం చేస్తారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించండి

- జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి



మాట్లాడుతున్న జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి

నెల్లూరు (వైద్యం), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ఆరోగ్యకేంద్రం పరిధిలో కుష్టువ్యాధి కొత్త కేసులను పక్కాగా గుర్తించాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి ఆదేశించారు. శుక్రవారం నెల్లూరులోని జనార్దన్‌రెడ్డి కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం సిబ్బందికి కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపుపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ వరకు కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీనికి అనుగుణంగా ప్రతీ ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి వ్యాధిగ్రస్తులను గుర్తించాలని సూచించారు. రాగివర్ణపు మచ్చలు ఉన్న వారిని అనుమానితులుగా గుర్తించి వైద్యులకు సిఫార్సు చేయాలన్నారు. వారి వివరాలను సకాలంలో జిల్లా కార్యాలయానికి అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కల్యాణి, డీపీఎంవో సుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఉడ్ బ్యాంకు ఏర్పాటుకు చర్యలు : డీఎఫ్‌వో



సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్‌వో మహబూబ్‌బాషా

ఉదయగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉదయగిరి చెక్కనగిషీ కేంద్రంలో కళాకారులు తయారుచేసే చెక్కనగిషీ వస్తువులకు సంబంధించిన ఉడ్ కొరత లేకుండా ఉడ్ బ్యాంకు ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా అటవీ శాఖాధికారి కే మహబూబ్‌బాషా పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని దిలావర్‌భాయ్ వీధి చెక్కనగిషీ కేంద్రంలో సబ్ డీఎఫ్‌వో శ్రీకాంత్‌రెడ్డితో కలిసి కళాకారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో కర్రతో బొమ్మలు, చెక్కనగిషీ, ఇతరత్రా వస్తువులు తయారు చేస్తారన్నారు. కళాకారులకు వస్తువులు తయారు చేసేందుకు తగినంత ఉడ్ సరఫరా లేక కళను వదిలేస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించిందన్నారు. వారికి తగిన సహాయ సహకారాలు అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాన్, అటవీ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కళాకారులు తయారుచేసే కర్ర కొరత లేకుండా అందుబాటులో ఉంచేందుకు ఉడ్ బ్యాంకు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉదయగిరి చెక్కనగిషీ కేంద్రంలో పలు రకాల వస్తువుల తయారీకి కలివి, వేప, బిల్లనెర్ధి, నెర్ధి కర్రను అధికంగా ఉపయోగిస్తున్నారన్నారు. వాటిని రిజర్వు ఫారెస్టుతోపాటు రైతుల పొలాల నుంచి సేకరిస్తున్నారన్నారు. అటవీ ప్రాంతం నుంచి ఆయా చెట్ల కర్రను తరలిస్తే భవిష్యత్తులో ఆయా జాతులు అంతరించే ప్రమాదముందన్నారు. అలా కాకుండా కళాకారులు తయారు చేసే చెక్కనగిషీ వస్తువులకు సంబంధించి ఏడాదికి ఎంత కర్ర అవసరమవుతుందని తెలుసుకుని అందుకు అనుగుణంగా అటవీ శాఖ ద్వారా ఉడ్ బ్యాంకు ఏర్పాటుచేసి ఆయా జాతుల మొక్కలను పెంచి వారికి సరఫరా చేసేందుకు వివరాలు సేకరించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో చిన వెంకటయ్య, ఎఫ్‌బీవో లక్ష్మీప్రసన్న, ఏబీవో బచ్చల వెంకటేశ్వర్లు, కేంద్రం నిర్వాహకులు గౌసియాబేగం, జాకీర్, కళాకారులు, సిబ్బంది పాల్గొన్నారు.

షుగర్ @ 5 లక్షలు 5 కోట్లు

- ఆందోళన కలిగిస్తున్న మధుమేహం
- జిల్లాలో 5 లక్షల మందికిపైగా వ్యాధిగ్రస్థులు
- ఇందులో చిన్నారులు 30వేల మంది
- ప్రతి నెల రూ.5 కోట్లకుపైగా ఖర్చు

● నేడు ప్రపంచ మధుమేహ నివారణ దినం



నెల్లూరు (వైద్యం), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : శరీరంలోని ప్రతీ కణానికి గ్లూకోజ్ అవసరం. అందుకే మనం తీసుకున్న ఆహారం జీర్ణమై గ్లూకోజ్‌గా మారి రక్తం ద్వారా ఒంట్లోని కణాలన్నింటికీ చేరుతుంది. ఆ గ్లూకోజ్‌ను కణాలు చక్కగా ఉపయోగించుకోవాలంటే ఇన్సులిన్ అనే హార్మోన్ అవసరం. ఈ హార్మోన్‌ను మన శరీరంలోని క్లోమ గ్రంధి ఉత్పత్తి చేస్తుంది. అయితే కొందరిలో ఇన్సులిన్ సరిగా ఉత్పత్తి కాకపోవడం, మరికొందరిలో ఉత్పత్తి అయినా సక్రమంగా పనిచేయకపోవడంతో రక్తంలో గ్లూకోజ్ నిలిచిపోతుంది. దీనినే మధుమేహం(చక్కెరవ్యాధి)గా పిలుస్తారు. సాధారణంగా మన శరీరంలో పరగడుపున పరీక్ష చేస్తే 100 మి.గ్రా. మించకుండా చక్కెర శాతం ఉండాలి. తిన్న తర్వాత 160 మిల్లీ గ్రాముల్లోపు ఉండాలి. ఈ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకమే. జిల్లా వ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో 20 శాతం మంది, గ్రామీణ ప్రాంతాల్లో 15 శాతం మంది మధుమేహంతో బాధపడుతున్నారు. చదువులో ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవడం, రోగ నిరోధక శక్తి తగ్గిపోవడం వంటి కారణాలతో పిల్లల్లోనూ మధుమేహాలు పెరుగుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి.

పరీక్షలు... మందులు

మధుమేహ వ్యాధిగ్రస్తులు తరచూ రక్తంలో గ్లూకోజ్ శాతాన్ని పరీక్షించుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రతీనెల వైద్యశాలలు, ల్యాబ్‌లకు వెళ్లాల్సి రావడం ఇబ్బందికరమే. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఇళ్లలోనే రక్తపరీక్షలు చేసుకునేందుకు వీలుగా గ్లూకోమీటర్ అందుబాటులోకి వచ్చింది. కొత్తగా భుజానికి ఒక బిళ్ల రూపంలో అతికించి గ్లూకోజ్ స్థాయిని ఎప్పటికప్పుడు గుర్తించే విధానం కూడా వచ్చింది. అలాగే మధుమేహ నియంత్రణకు ఆధునిక మందులు లభిస్తున్నాయి. ప్రభుత్వం తరపున వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నా 65 శాతం మంది రోగులు బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇందుకోసం ప్రతి నెల సరాసరి రూ.5 కోట్లకుపైగా బాధితులు ఖర్చు చేస్తున్నారంటే వ్యాధి తీవ్రత, మందుల అమ్మకాలు ఎలా ఉన్నాయో తెలుస్తుంది. ఈ వ్యాధి నియంత్రణకు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంటూ సమతులం ఆహారం తీసుకోవాలని, నిత్యం వ్యాయామం చేయాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఎన్నో ఆధునిక వైద్య విధానాలు



మధుమేహం. ఊబకాయ చికిత్సలో అనేక మార్పులు వచ్చాయి. జీపీఎల్ 1 వంటి ఇంజక్షన్ రెండువారాలకు ఒకసారి ఇవ్వటం ద్వారా ఊబకాయం అదుపులో ఉంటుంది. తద్వారా ఆహారం తక్కువగా తీసుకుంటూ మధు మేహాన్ని నియంత్రించుకునే వీలుంటుంది. టైపు 2 మధుమేహం ఉన్న వారి గుండె వ్యాధులను పూర్తిగా నియంత్రించ వచ్చు. సహజమైన ఆహారం తీసుకుంటూ, ప్రతిరోజూ వ్యాయామం చేయడం మంచిది. మందులతో పాటు ఇతర నియమాలు తప్పనిసరిగా పాటించాలి.

- డాక్టర్ రామ్మోహన్, ఎండోక్రైనాలజిస్ట్, అపోలో హస్పిటల్

చిన్నారుల విషయంలో జాగ్రత్త



ప్రస్తుతం చిన్నపిల్లలు ఎక్కువగా మధుమేహానికి గురవుతున్నారు. ప్రధానంగా టైప్‌వన్ డయాబెటిస్ బాధితులు ఇన్సులిన్ తప్పనిసరిగా జీవితాంతం వాడాల్సి ఉంటుంది. రెగ్యులర్‌గా వ్యాయామం, ఆహార నియమాలు తప్పనిసరిగా పాటించాలి. వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే గుండె, మూత్రపిండాలు, నేత్ర వ్యాధులు సంక్రమిస్తాయి. ఎప్పటికప్పుడు రక్తంలో చక్కెర శాతాన్ని పరీక్ష చేయించుకుని పూర్తి నియంత్రణలో ఉంచుకోవాలి.

- డాక్టర్ సునంద, ఎండోక్రైనాలజిస్ట్, నారాయణ ఆసుపత్రి

యువతలో షుగర్ ఎక్కువ

- మెడికవర్ వైద్య నిపుణులు

మధుమేహ బాధితుల సంఖ్య గత మూడు దశాబ్దాలలో రెండింతలు పెరిగింది. వీరితో యువత ఎక్కువగా ఉన్నారని మెడికవర్ వైద్య నిపుణులు వెల్లడించారు. గురువారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశం లో వైద్య నిపుణులు డాక్టర్ రవీంద్రరెడ్డి, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ పెంచలప్రసాద్, డాక్టర్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా 20 ఏళ్లలోపు వారిలో 11 లక్షల మంది షుగర్‌తో బాధపడుతున్నారని చెప్పారు. టైపు 2 మధుమేహాల సంఖ్య కూడా బాగా పెరిగిందన్నారు. వైద్యులను సంప్రదించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

సీతారామపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మారంరెడ్డిపల్లి సొసైటీలో గురువారం సొసైటీ ఛైర్మన్ సోమనబోయిన రాజశేఖర్, టీడీపీ మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులు, జనసేన పార్టీ నాసేన కోసం నావంతు రాష్ట్ర కమిటీ మెంబర్ భోగినేని కాశీరావు, డైరెక్టర్లు రైతులకు యూరియా పంపిణీ చేశారు. తగినంత యూరియా అందు బాటులో ఉందని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మారంరెడ్డిపల్లి సొసైటీ అధ్యక్షుడు సోమనబోయిన రాజశేఖర్ అన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12120
వెండి కిలో ధర	రూ. 168500
వెండి ఒక గ్రాము	రూ. 174.50

న్యూస్ బాక్స్

అపస్మా స్పోర్ట్స్ మీట్ కరపత్రం ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో మనోహర్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి అపస్మా స్పోర్ట్స్ మీట్ సందర్భంగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ స్పోర్ట్స్ మీట్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ అపస్మా అధ్యక్షుడు కేవీ రత్నం, కరస్పాండెంట్స్ పోలు అంకిరెడ్డి, ఎస్.ఐజాక్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

చంద్రన్న ప్రమాద బీమా చెక్కు పంపిణీ



మృతుడి భార్యకు నగదు చెక్కు అందజేస్తున్న గురవారెడ్డి

దుత్తలూరు(ఉదయగిరి), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెడ్డుపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మేలంగి సురేష్ ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన భార్య ప్రియాంకకు రూ.5 లక్షల చంద్రన్న ప్రమాద బీమా నగదు చెక్కును మండల టీడీపీ కన్వీనర్ ఉండేలా గురవారెడ్డి గురువారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం కలిగిన సురేష్ ప్రమాదంలో మృతిచెందిన విషయాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఆయన సమగ్ర వివరాలతో విజయవాడ పార్టీ కార్యాలయానికి పంపడంతో సురేష్‌కు రూ.5లక్షల ప్రమాద బీమా మంజూరైందని, ఆ చెక్కును భార్య ప్రియాంకకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరత్నం, గ్రామ కమిటీ అధ్యక్షుడు చెన్నకేశవులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి సర్వేపై శిక్షణ



ఎంపీడీవో కార్యాలయంలో గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న అధికారులు

సంగం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కుష్టువ్యాధి గుర్తింపునకు ఇంటింటా సర్వేపై స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలకు వైద్యాధికారి డాక్టర్ అశోక్ గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ నుంచి 30 వరకు కుష్టువ్యాధి గుర్తింపునకు మండలంలో ఇంటింటా సర్వే జరగనుంది. ఈనేపథ్యంలో కుష్టువ్యాధి లక్షణాలు, ఇంటింటా సర్వేలో ఎలా గుర్తించాలి తదితర అంశాలపై ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సోమా నాయక్, ఎంపీడీవో షాలెట్, డిప్యూటీ ఎంఈవో జానికీరామ్, వైద్యాధికారి డాక్టర్ అశోక్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ఉదయగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలాజీనగర్‌లో జరుగుతున్న పారిశుధ్య పనులను గురువారం ఎంపీడీవో శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో మోహన్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీధులు, నివాసాల్లో సేకరించిన చెత్తను క్రమం తప్పకుండా డంపింగ్‌యార్డుకు తరలించాలన్నారు. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. కాలువల్లో ప్లాస్టిక్, ఇతరత్రా వ్యర్థాలు వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో కరీ ముల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

యువతి ఆచూకీ లభ్యం

ఉదయగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావు పల్లి గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైన విషయంపై తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి బుధవారం కేసు నమోదు చేశారు. యువతి అచూకీ కోసం సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు ప్రకాశం జిల్లా టంగుటూరులో యువతి ఉన్నట్లు గుర్తించి గురువారం ఉదయగిరికి తీసుకొచ్చారు. అనంతరం రెవెన్యూ అధికారుల సమక్షంలో ఆ యువతిని తల్లిదండ్రులకు అప్పగించారు.

టీడీపీ పటిష్టతకు అంకితభావంతో పని చేయాలి

అట్టహాసంగా ప్రమాణ స్వీకారం



ఆత్మకూరు: ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆత్మకూరు పట్టణ టీడీపీ నేతలు



మర్రిపాడులో ప్రమాణ స్వీకారం చేస్తున్న వివిధ పదవులకు ఎన్నికైన నేతలు



సంగంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న తెలుగుదేశం పార్టీ కమిటీ సభ్యులు

ఆత్మకూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆశయ సాధనలో భాగంగా ఆత్మకూరులో టీడీపీ పటిష్టతకు పదవులు చేపట్టిన ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని పార్టీ పరిశీలకులు జాకీర్‌హుస్సేన్, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, సుంకర పెంచలచౌదరి సూచించారు. స్థానిక త్రికోటేశ్వర కల్యాణ మండపంలో గురువారం ఆత్మకూరు పట్టణ, రూరల్ వార్డు అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జ్‌ల ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ముందుగా పార్టీ నేతలు టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు నూతన విధానాలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ ముందుకు వెళుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ జి వెంకటరమణమ్మ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, టీడీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు కొప్పోలు రమాదేవి, పట్టణ ప్రధాన కార్యదర్శి తోడేటి వెంకటయ్య, టీడీపీ సీనియర్ నాయకులు కేతా విజయభాస్కర్‌రెడ్డి, ఎల్‌వీ రమణయ్య, చెరుకూరు పద్మావతమ్మ, తలచీరు బాబునాయుడు, మద్దినేని నారాయణ, పి జయాకర్, ఆత్మకూరు సొసైటీ అధ్యక్షుడు పరిటాల సత్యం, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

● **మర్రిపాడు:** తెలుగుదేశం పార్టీ మండల, గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిల పదవీ ప్రమాణ స్వీకారోత్సవం గురువారం జరిగింది. మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఇటీవల మండలంలో నూతనంగా పలు పదవులకు ఎన్నికైన నాయ కులచే ఆత్మకూరు మార్కెటింగ్ కమిటీ చెర్మన్ ఆరికట్ల జనార్ధన్‌నాయుడు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్ర మంలో టీడీపీ మండల అధ్యక్షుడు గంగాధర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి, బీమవరం సొసైటీ అధ్య క్షుడు చిన్నారెడ్డి, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు శాఖ మూరి నారాయణ, నాయకులు శ్రీనివాసులురెడ్డి, బూద వాడ సొసైటీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **సంగం:** స్థానిక వెంకటేశ్వర కల్యాణ మండపంలో మండల పార్టీ అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్‌స్థాయి కమిటీ సభ్యుల గురువారం ప్రమాణ స్వీకారం కోలాహలంగా జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్‌స్థాయి కమిటీ సభ్యులతోపాటు అనుబంధ సంఘాల కమిటీ అధ్యక్షులు, సభ్యులు మొత్తం 190 మంది ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు గుండ్లపల్లి శ్రీనివాసులుయాదవ్, అన్నారెడి పాళెం, కొరిమెర్ల సాగునీటి సంఘం అధ్యక్షులు సూరా శ్రీనివాసులరెడ్డి, షేక్ బాబు, మండల రైతు సంఘం అధ్యక్షులు కంచర్ల ప్రకాష్ నాయుడు, టీడీపీ నాయకులు కర్నాటి రవీంద్రరెడ్డి, విజయ్ చంద్ర, తెలుగు యువత అధ్యక్షులు చరణ్‌రెడ్డి, అన్ని గ్రామాల టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **వింజమూరు :** తెలుగుదేశం పార్టీ మండల క్లస్టర్ కో కన్వీనర్‌గా మండలంలోని చంద్రపడియ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పాములపాటి మాల్యాద్రిని పార్టీ ప్రకటించింది. మండల టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పాములపాటి మాల్యాద్రి మాట్లాడుతూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తానని ఆయన తెలిపారు.

ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి : సీపీఎం



ఆర్ అండ్ బీ కార్యాలయ వరండాలో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు

ఉదయగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గురువారం సీపీఎం ఆధ్వర్యంలో కొండకింద గ్రామాల ప్రజలు ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా సీపీఎం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ వర్షాలకు ఘాట్‌రోడ్డు మొత్తం కోతకు గురైందన్నారు. ఈ రహదారిపై సుమారు 11 గ్రామాలకు చెందిన 16వేల మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. రహదారి సరిగా లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దశాబ్దాలుగా అటవీ అనుమతుల్లేక 3.2 కిలోమీటర్ల మేర నిలిచిన రహదారి పనులు చేపట్టకపోవడం సిగ్గుచేటన్నారు. అలాగే దున్నపోతుల వాగు వద్ద దెబ్బతిన్న వంతెన నిర్మించడంతోపాటు పలు గ్రామాల్లో ఛిద్రమైన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యాలయంలో సమస్యలు చెప్పుకునేందుకు అధికారులు అందుబాటులో లేకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేయాలి



ఉదయగిరిని డివిజన్ చేయాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజానీకం

ఉదయగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన ఉదయగిరిని రెవెన్యూ డివిజన్‌గా చేసి అభివృద్ధికి నాంది పలకాలని జిల్లా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ కె వేణుగోపాల్ కోరారు. గురువారం ఉదయగిరి రెవెన్యూ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో నాయకులు, సీనియర్ సిటిజన్లు, ప్రజాసంఘాలు, విద్యార్థులతో కలిసి పట్టణంలోని రంగనాయకుల ఆలయం నుంచి మెయిన్ బజార్ గుండా పంచాయతీ బస్టాండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పంచా యతీ బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ అనాదిగా ఉదయగిరి ప్రాంతం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి, పాలకుల వివక్షకు గురవుతోందన్నారు. ఉదయగిరిని జిల్లా చేయాలని ఆరున్నరేళ్లుగా ఉద్యమాలు చేస్తున్నామన్నారు. కనీసం రెవెన్యూ డివిజన్ అయినా అవుతుందని తమ తపన అన్నారు. జిల్లాలో అతిపెద్ద నియోజకవర్గమైన ఉదయగిరిని రాష్ట్ర ప్రభుత్వం కావలి రెవెన్యూ డివిజన్‌లో కలపాలని చూడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ద్వారా ప్రభుత్వానికి తమ ప్రాంత స్థితిగతులను వివరిస్తామని, అప్పటికైనా ప్రభుత్వం కళ్లుతెరిచి ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేయాలన్నారు. లేదంటే డివిజన్ కోసం దశల వారీగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ ఎస్ వెంకటరావు తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డీఎంహెచ్‌వో మాశిలామణి, యూడీఎఫ్ ప్రతినిధులు ఖాజా, శ్రీరామచంద్రమూర్తి, జిల్లా సాధన సమితి నాయకులు దస్తగిరిఅహ్మద్, రామిరెడ్డి, ఖాదర్‌బాషా, జీ శ్రీనివాసులరెడ్డి, భాస్కర్‌రెడ్డి, జాఫర్‌మొహిద్దీన్, ఎస్థానీ, ముర్తుజా, సలీం, సందిరెడ్డి రామారావు, చెన్నకేశవులు పాల్గొన్నారు.

ఎవరు.. ఎక్కడున్నారు!

(5వ పేజీ తరువాయి)

ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనాల ఆధారంగా ఎంపీడీఓలను ప్రశ్నించారు. సిబ్బంది గైర్హాజరు కావడం, ఏదో ఒక నెపంతో సచివాలయానికి దూరంగా సొంత పనులకు నిమగ్నం కావడం పట్ల కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఉన్న పళంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న సచివాలయాలను ఆకస్మిక తనిఖీలు చేయమని ఆదేశించారు. అందుకోసం ప్రత్యేకంగా ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓ, మరి కొంతమంది జిల్లా అధికారులతో 70 బృందాలు ఏర్పాటు చేశారు. ఈ బృందాలు గురువారం ఉదయం నుంచి సచివాలయాలను ఆకస్మిక తనిఖీలు చేశారు. జిల్లావ్యాప్తంగా 779 సచివాలయాలు ఉండగా వాటిలో 260 సచివాలయాలను గురువారం ఒక్కరోజే తనిఖీలు చేశారు. సచివాలయాల్లో ఎంత మంది ఉండాలి, ఎంత మంది ఉన్నారో పరిశీలించారు. అటెండెన్స్ రిజిష్టర్లను, మూవ్‌మెంట్ రిజిష్టర్లను పరిశీలించారు. వీరు సందర్శించిన సచివాలయాల్లో మొత్తం 1967 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా 1566 మంది మాత్రమే సచివాలయాల్లో ఉన్నారు. మిగిలిన 369 మంది కనిపించలేదు. వీరికి సంబంధించిన అటెండెన్స్‌ను, మూవ్‌మెంట్ రికార్డులను పరిశీలించారు. వీరిలో చాలా మంది ఫీల్డ్‌లోకి వెళ్లారని సహ సిబ్బంది సమాచారం ఇవ్వడంతో మూవ్‌మెంట్ రిజిష్టర్లు పరిశీలించారు. ఇందు లో 84 మంది సిబ్బంది ఎలాంటి సమాచారం లేకుండా గైర్హాజరు అయ్యారనే విషయాన్ని గుర్తించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్య వైఖరికి సమాధానం ఇవ్వాలని ఆ 84 మంది సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. నెల్లూరులో కమిషనర్ నందన్, కార్యదర్శి శ్రీలక్ష్మి, సిటీ ప్లానర్ హిమబిందులు తనిఖీల్లో పాల్గొనగా, మండల స్థాయిలో ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, పలువురు జిల్లాస్థాయి అధికారులు తనిఖీల్లో పాల్గొన్నారు.



లింగసముద్రంలో..

రక్తదానం ప్రాణదానంతో సమానం : జేవీవీ



రక్తదానం చేస్తున్న యువకులు

వరికుంటపాడు(ఆంధ్రజ్యోతి), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మిత శ్రీనివాసులురెడ్డి అన్నారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి అపోహలకు లోనుకాకుండా ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలన్నారు. మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేసినప్పటికీ ఎలాంటి ప్రమాదం ఉండదన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి చైతన్యవంతం చేయడం జరుగుతుందన్నారు. రక్తదానం చేసిన వారికి గ్రూపు నిర్ధారణ చేసి తెలియజేయడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు ఓడీ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. కాగా ఉద్యోగులు, యువకులతో పాటు అన్ని వర్గాలకు చెందిన 62మంది రక్తదానం చేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎం సుబ్బారావు, ఉపాధ్యక్షుడు పీ చెన్నకేశవులు, కార్యదర్శి పీ మాల్యాచలం, సర్పంచు దిలీప్‌కుమార్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ కరీముల్లా, డీవీ రమణయ్య, ఉపాధ్యక్షులు పఠాన్ రసూల్, అంజనేయులు, కోశాధికారి హజరత్ తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి : డీఎల్‌పీవో



బోరు వద్ద పరిసరాలను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రమణయ్య

సీతారామపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డయేరియాపై అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రతి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని డీఎల్‌పీవో రమణయ్య సూచించారు. మండల పరిధిలోని పబ్బులేటి పల్లి గ్రామ పంచాయతీలో డయేరియా కేసు నమోదు కావడంతో గురువారం అధికారులు అప్రమత్తమై పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు డీఎల్‌పీవో రమణయ్య పాల్గొని గ్రామంలోని బోర్ పైపులైన్ల వద్ద, డ్రైనేజీలలో బ్లీచింగ్ చల్లించారు. అలాగే వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న వైద్యశిబిరం, నీటి క్లోరినేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయేరియా కేసులు అధిగమించకుండా అధికారులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు నీటి క్లోరినేషన్ చేపట్టాలని, ప్రతి వీధిలో బ్లీచింగ్ చల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో చంద్రశేఖర్, డిప్యూటి ఎంపిడివో శివప్రసాద్, డాక్టర్ స్వప్నరెడ్డి, సర్పంచ్ ఆదినారాయణ, సచివాలయ సిబ్బంది, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి : ఎస్ఐ



ఆత్మకూరు: వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ షేక్ జిలాని

ఆత్మకూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు, మోటారు వెహికల్ చట్టాలను పాటించాలని ఎస్ఐ షేక్ జిలాని సూచించారు. ఇటీవల జిల్లా కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో గురువారం ఆత్మకూరు పట్టణంలోని ప్రధాన చౌరస్తాలు, రహదారుల్లో వాహనదారులకు చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ప్రమాదాల నివారణకు సహకరించాలని ఆయన కోరారు.

● **సంగం :** ముంబాయి రహదారిపై ప్రయాణం చేసే వాహనదారులకు ప్రమాదాల నివారణపై ఎస్ఐ రాజేష్ గురువారం రాత్రి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన ముంబాయి రహదారిపై ప్రయాణం చేసే వాహనదారులను నిలిపి రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్, సీటు బెల్టు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వాహనాదారులు పాల్గొన్నారు.

● **వింజమూరు:** రోడ్డు ప్రమాదాల నివారణపై గురువారం ఎస్ఐ వీరప్రతాప్ ఆధ్వర్యంలో యువతకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివేగం, మద్యం సేవించడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ప్రయాణించడం ప్రమాదాలకు కారణమవుతున్నాయని తెలిపారు. అదేవిధంగా ఆటోవాలాలు కూడా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. కావున తగిన జాగ్రత్తలు పాటించి రోడ్డు ప్రమా దాలు నివారించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆటోవాలాలు తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

పెంచలకోనలో తలనీలాల చోరీ

రాపూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోనలో తలనీలాలు చోరీ అయిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఆలయ అధికారులు తెలిపిన వివరాల మేరకు సాయంత్రం 7.30 గంటల ప్రాంతంలో కళ్యాణ కట్ట మూసివేసిన తర్వాత అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను దేవస్థానం సిబ్బంది గమనించారు. వారిని అడ్డుకుని ప్రశ్నించడంతో వారు తమవద్ద ఉన్న బ్యాగును అక్కడే వదిలి పారిపోయారు. ఆ రెండు బ్యాగులను పరిశీలించగా ఒక బ్యాగులో తలనీలాలు, మరొక బ్యాగులో రశీదు కనిపించాయి. ఆలయ అధికారులు వెంటనే పెంచలకోన టూరిస్టు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బలిజ అన్నదానం సత్రంలో దాక్కొని ఉన్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయాన్ని తలనీలాల లైసెన్స్‌దారుడు కత్తుల యాదగిరికి తెలియజేయగా, టూరిస్ట్ పోలీసుల కస్టడీలో ఉన్న ముగ్గురు వ్యక్తులు ఎస్ మోహన్‌రాజ్, హరి, మోహన్‌గా గుర్తించారు. వారు ఇదివరకు కోనలోని తలనీలాల సేకరణ విభాగంలో గతంలో పని చేసిన సిబ్బంది అని తెలిపారు. ప్రస్తుతం వీరు పని చేయడం లేదని తెలిపారు. అందకుముందు ఇక్కడ పని చేసే సమయంలో అదనపు తాళాలు సమకూర్చుకుని, ఈ చోరీకి యత్నించినట్లు తెలిపారు. ఈ సంఘటనపై రాపూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని పోలీసు అధికారులను కోరామని ఆలయ ఉప కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

● **రేణుకా ఎల్లమ్మతల్లి ఆలయంలో..**

దుత్తలూరు (ఉదయగిరి, ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ పంచాయతీ గుదేవారిపాళెంలో ఉన్న రేణుకా ఎల్లమ్మతల్లి ఆలయంలో గురువారం పట్టపగలే చోరీ జరిగింది. వివరాల మేరకు.. గుర్తుతెలియని వ్యక్తులు మధ్యాహ్న సమయంలో ఆలయంలోకి ప్రవేశించి అక్కడ ఏర్పాటుచేసిన హుండీని ఎత్తుకెళ్లారు. సమీపాన ఉన్న తోటలో హుండీని ధ్వంసం చేస్తుండగా చుట్టుపక్కల ఉన్న ప్రజలు శబ్దాలు విని కేకలు వేయడంతో అందులో ఉన్న నగదు తీసుకుని అక్కడ నుంచి పరారయ్యారు. హుండీలో సుమారు రూ. 20 వేలు నగదు ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ ఆదిలక్ష్మి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఆత్మకూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆత్మకూరు పట్టణ సమీపంలోని జాలయనగరం సమీపంలో ఉన్న ఎస్ఎస్ డాబా సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగింది. ఆత్మకూరు వైపు నుంచి సంగం వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం రోడ్డుపై వాటర్ బాటిల్స్ ఏరుకుంటూ వెళుతున్న వ్యక్తిని వెనుక నుంచి ఢీ కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతిచెందినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. మృతదేహం పూర్తిగా ఛిద్రం కావడంతో మృతుని వివరాలు తెలియలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ జిలాని తెలిపారు.

● **రైలు ఢీకొని యువకుడు..**



పెయ్యల శ్రీనివాసులు (ఫైల్)

కోవూరు, నవంబరు 13, (ఆంధ్రజ్యోతి): పడుగుపాడు రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం రైల్వేలైను దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో కోవూరు రైల్వేరోడ్డు ప్రాంతానికి చెందిన పెయ్యల శ్రీనివాసులు (27) అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వేరోడ్డు నుంచి కావలి- నెల్లూరు రోడ్డు చేరుకునేందుకు రైల్వే ట్రాక్ దాటుతుండగా వేగంగా వచ్చి రైలు ఢీకొనడంతో మృతి చెందినట్లు రైల్వే పోలీసులు భావిస్తున్నారు. కావలి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్ట్

రాపూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని గోనుపల్లి శివారులో పేకాట స్థావరంపై పోలీసులు గురువారం ఆకస్మికంగా దాడి చేశారు. స్థానిక వ్యవసాయ భూమి శివారులో జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించి, ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వెంకట రాజేష్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 20,100 నగదు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డిప్లమో విద్యార్థి అదృశ్యం

నెల్లూరు(క్రైం), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): డిప్లమో చదువుతున్న విద్యార్థి అదృశ్యంపై చిన్నబజారు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని మూలాపేట వాకర్స్‌రోడ్డులో మల్లికార్జున, సుజాత దంపతులు నివసిస్తున్నారు. మల్లికార్జున కార్పెంటర్‌గా, సుజాత టైలరింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు హర్షవర్ధన్ గీతాంజలి కళాశాలలో డిప్లమో చివరి సంవత్సరం చదువుతున్నాడు. రోజూ లానే ఈ నెల 11వ తేదీ ఉదయం కళాశాలకు వెళ్లి మధ్యాహ్నం 1.30 గంటలకు తిరిగి ఇంటికి వచ్చాడు. ఆ తర్వాత 3.30 గంటల సమయంలో బయటకు వెళ్లి వస్తానని ఇంట్లో వారికి చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించినా ప్రయోజనం లేక చిన్న బజారు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమార్తె మరణంపై అనుమానం

నెల్లూరు(క్రైం), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తన కుమార్తె మరణంపై అనుమానం ఉందని ఓ తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో చిన్నబజారు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని బీవీనగర్‌కు చెందిన అబ్దుల్ హఫీజ్ బెంగళూరులో సాఫ్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ ప్రస్తుతం నెల్లూరులో ఉంటూ వర్క్‌ఫ్రమ్ హోమ్ చేస్తున్నారు. ఆయనకు 2019లో నిజామాబాద్‌కు చెందిన ఆయిషా కౌసర్‌తో వివాహమైంది. వారికి ఆలియా మేహ్రిన్, జైన్ మేహ్రిన్ అని ఇద్దరు కుమార్తెలు. గతేడాది ఆగస్టులో కౌసర్ ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. అనంతరం హఫీజ్ మేనత్త గుల్షన్ కుమార్తె రోషినిని రెండో వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి ఇద్దరు పిల్లలను మేనత్త వద్దే ఉంచాడు. ఈ నెల 12వ తేదీ పెద్ద కుమార్తె ఆలియా మేహ్రిన్ బాత్‌రూమ్‌లో పడిపోయి ఉందని ఫోన్ రావడంతో హఫీజ్ హుటాహుటిన మేనత్త ఇంటికి చేరుకున్నాడు. కుమార్తె మాట్లాడలేని స్థితిలో ఉండటంతో ప్రైవేటు వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందిందని తెలిపారు. ఈ విషయాన్ని హఫీజ్ విజయవాడలోని మొదటి భార్య తల్లిదండ్రులకు తెలిపాడు. విషయం తెలుసుకున్న మొదటి భార్య మేనమామ జావిద్ ఆలియా మేహ్రిన్ మరణంపై అనుమానాలు ఉన్నాయని 112 నెంబరుకు ఫోన్ చేసి తెలిపాడు. ఈ క్రమంలో తన కుమార్తె మరణంపై అనుమానాలు ఉన్నాయని హఫీజ్‌కు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త వేధింపులపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులపై భార్య ఇచ్చిన ఫిర్యాదుతో నవాబుపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని శెట్టిగుంటరోడ్డు సమీపంలో బల్లెం సందీప్, శ్వేత దంపతులు నివసిస్తున్నారు. వారు 2008లో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆ దంపతులకు ఇద్దరు పిల్లలు కలిగారు. భర్త మరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని శ్వేత నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోకూరు పశువైద్యశాల భవన నిర్మాణానికి నిధుల మంజూరు

వలేటివారిపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోకూరు పశువైద్యశాల భవనం పునఃనిర్మాణానికి రూ. 50 లక్షల నిధులు మంజూరయినట్లు పశువైద్యాధికారి సుధాకర్ తెలిపారు. పోకూరులోని పశువైద్యశాల భవనం స్లాబు పెచ్చులూడి వర్షంనీరు భవనంలోకి చేరి మందులు తడిచిపోయి ఇబ్బందులు పడుతున్నారు. గత 40 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరింది. అంతేగాకుండా వైద్యశాలలో మరుగుదొడ్లు లేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వెద్యాధికారి, సిబ్బంది స్థానిక శాసనసభ్యులు నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. వసతులు లేక డాక్టర్, సిబ్బంది పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఇంజనీరింగ్ అధికారులచే ప్రతిపాదనలు సిద్ధంచేసి నిధులు మంజూరుకు కృషి చేశారని వెద్యాధికారి సుధాకర్ తెలిపారు.

ఇప్పుడే ఇలా.. డివైడర్లు ఏర్పాటైతే ఎలా..?

● రోడ్ల విస్తరణ, సెంట్రల్ డివైడర్, లైటింగ్ పనులపై భిన్నాభిప్రాయాలు


పామూరు రోడ్డులో వన్‌వే అమల్లోకి రావటంతో స్తంభించిన ట్రాఫిక్

కందుకూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరి ష్కారం, ప్రధాన రహదారుల సుందరీకరణ లక్ష్యంగా చేపట్టిన రోడ్ల విస్తరణ, సెంట్రల్ డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులపై భిన్నాభి ప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ట్రాఫిక్ సమ స్య పరిష్కారం కోసం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు రోడ్ల విస్తరణ చేపట్టడం వరకు ఓకే కానీ సుందరీకరణ కోసం సెంట్రల్ డివె డర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుమాత్రం కొత్త సమస్యలను తీసుకురావటం ఖాయమన్న అభి ప్రాయం వ్యక్తమవుతోంది. ఎన్టీఆర్ సర్కిల్ నుం చి పామూరురోడ్డు సర్కిల్ వరకు ఇరువైపులా రోడ్డు విస్తరణ పనులు దాదాపు పూర్తవటంతో గురువారం నుంచి సెంట్రల్ డివైడర్ ఏర్పాటు పనులకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా డివైడర్ మార్కింగ్ ఇచ్చి నమూనాలో ఇనుప చువ్వలు పాతి రెడ్‌రిబ్బన్లు ఏర్పాటుచేశారు. దీంతో గురువారం ట్రాఫిక్ విషయంలో వన్‌వే అమల్లోకి రావటంతో భవిష్యత్తు కళ్లముందు సాక్షాత్కారమైంది. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి రిలయన్స్ మార్ట్ వరకు ఎలాంటి సమస్య లేదు కానీ అక్కడినుంచి అడుగడుగునా ట్రాఫిక్ జామ్ అయింది. లారీలు, బస్సులు లాంటి వాహనాలు వెళ్లే సమయంలో కనీసం మోటారుసైకిల్ కూడా వాటిని క్రాస్ చేసే పరిస్థితి లేకపోగా ఏదైనా కారణంతో అవి ఆగితే పది, పదిహేను నిమి షాలు మొత్తం వాహనాలు నిలిచిపోతున్న పరి స్థితులు కనిపించాయి. ముఖ్యంగా ఆంధ్రా బ్యాంకు, కెనరా బ్యాంకు సెంటర్, ఎరువుల దుకాణాల వద్ద పెద్ద ఎత్తున రోడ్డుకు ఇరు వైపులా మోటారుసైకిళ్లు పెట్టి ఉండటంతో బస్సు కూడా వెళ్లలేని స్థితిలో ట్రాఫిక్ జామ్ అయింది. ఈ స్థితిలో డివైడర్ ఏర్పాటుకన్నా రోడ్డు మధ్యలో మోటారుసైకిల్ పార్కింగ్‌కు అవకాశం కల్పిస్తే సమస్య చాలా వరకు పరిష్కారం అవుతుందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. ఇక ఓవీ రోడ్డులోను కోటారెడ్డి హాస్పటల్ సెంటర్ నుంచి సింగరాయకొండ వైపు ఇబ్బందిలేదు కానీ అక్కడి నుంచి అంబే డ్కర్ విగ్రహం సెంటర్ వరకు డివైడర్ ఏర్పా టైతే ట్రాఫిక్ కష్టాలను కొనితెచ్చుకున్నట్లేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా పాల కులు, అధికారులు ముందుచూపుతో తగు చర్య లు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రమాదకరంగా ఆర్అండ్‌బీ రహదారి


దెబ్బతిన్న ఆర్అండ్‌బీ రోడ్డు

బిట్రగుంట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ఏనుగులబావి, జువ్వలదిన్నె పంచాయతీల మధ్య రొయ్యల గుంట ల వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఒకవైపు రోడ్డు దెబ్బ తినింది. రొయ్యల గుంటల్లోని నీటి ప్రవాహంతో రహదారి కోతకు గురై, గోతి ఏర్పడింది. జువ్వలదిన్నె, ఫిషింగ్ హార్బర్లకు తరచూ వాహన రాకపోకల వల్ల రోడ్డు దెబ్బతినింది. ప్రమాదాలు సంభవించ కముందే సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేప ట్టాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

కారు ఢీకొని గేదె మృతి

కలిగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెదకొండూరు వద్ద గురువారం రాత్రి కారు ఢీకొని గేదె మృతి చెందింది. గుంటూరు నుంచి ఆత్మకూరుకు వెళ్తున్న కారు ఢీకొనడంతో ద్రోణాదుల వెంకటేశ్వర్లు అనే రైతుకు చెందిన గేదె మృతి చెందింది. గేదె ఖరీదు సుమారు రూ. 1 లక్ష ఉంటుందని బాధితులు కన్నీరు మున్నీరయ్యారు. ఇదిలా ఉండగా కారులో ప్రయాణిస్తున్నవారు ఆత్మకూరు చెందిన బట్టేపాడు వాసులని తెలిసింది. కారులో ఉన్న ఇద్దరు గాయపడగా వారిని కలిగిరి ప్రవేటు వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ ఉమాశంకర్ తెలిపారు.

ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయండి

గిరిజనులకు కావలి ఆర్డీవో వంశీకృష్ణ భరోసా


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఆర్డీవో వంశీకృష్ణ

అల్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గిరిజనులు సమాజంలో కలసి మెలసి జీవించేందుకు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని కావలి ఆర్డీవో వంశీకృష్ణ గిరిజనులకు పిలుపునిచ్చారు. అల్లూరు మండలం సింగపేట గిరిజన కాలనీలో ఏఆర్డీ సంస్థ ఆధ్వర్యంలో గురువారం గిరిజనులకు ఆర్డీవో నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గిరిజనుల సమస్యలను స్థానిక నాయకుడు బండి అమర్‌రెడ్డి ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. బాల్యవివాహాలు మానేసి, బాలబాలికలను చదివించాలని సూచించారు. చదువుతోనే గౌరవం లభిస్తుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా గిరిజనులను ఆదుకుంటామన్నారు. ఒకచోట స్థిరనివాసం లేకపోవడం వల్ల గిరిజనులు సంక్షేమ పథకాలను పొందే అవకాశాన్ని కోల్పోతున్నారని ఆర్డీవో అన్నారు. ఏఆర్డీ సంస్థ ప్రతినిధి బషీర్, తహసీల్దారు లక్ష్మీనారాయణ, డీడీఓ వరప్రసాద్, గిరిజన నాయకురాలు బాపన సత్యవతమ్మ, స్థానిక గిరిజన నాయకులు పాల్గొన్నారు.

మహిళా స్టేషన్ డీఎస్పీ సస్పెన్షన్

నెల్లూరు(క్రైం,ఆంధ్రజ్యోతి): మహిళా పోలీ సు స్టేషన్ డీఎస్పీ చెంచు రామారావును స స్పెండ్ చేస్తూ గురువారం రాష్ట్ర డీజీపీ హరీ ష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. ఓ కేసులో నగదు తీసుకున్నారన్న అభియోగం నేపథ్యంలో ఆయనను సస్పెండ్ చేశారు.

హెల్మెట్ వాడకమే ప్రాణాలకు శ్రీరామరక్ష

సీఐ రాజేశ్వరరావు


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రాజేశ్వరరావు

కావలి రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల సమయంలో హెల్మెట్ వాడకమే వాహనదారులకు శ్రీరా మరక్ష అని సీఐ జీ రాజేశ్వర రావు పేర్కొన్నారు. పట్టణంలోని మద్దూరుపాడు క్రాస్ రోడ్డు సమీపంలో గురువారం హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం జరిగింది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వాహనదా రులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, తలకు తగిలిన గాయాలతోనే ఎంతో మంది మృత్యువాత పడుతున్నారన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ కొను గోలు చేసి ధరించాలని వాహనదారులకు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపటం, త్రిబుల్ రైడ్, మైనర్ బాలురకు వాహనాలు అప్పగించటం చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు తిరుమల రెడ్డి, బాజీబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి: మండలంలోని పెదకొండూరు గ్రామంలో గురువారం రాత్రి ఎస్ఐ ఉమాశంకర్ స్థానిక ప్రజలకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. కావలి-దుత్తలూరు 167 జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలు అతి వేగంతో వెళ్తాయని, రోడ్డు పక్కన ఉన్న గ్రామాల ప్రజలు నిత్యం జాగ్రత్తగా ఉండాలన్నారు. రోడ్లు దాటేటప్పుడు పూర్తిగా ఆగి వెళ్లాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రాణాలు గాలిలో కలిసిపోతాయని వీడియో ద్వారా యువకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెదకొండూరు మాజీ సర్పంచ్ చావా హజరత్‌బాబు, పోలీసు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

పగులగొట్టారు.. వదిలేశారు!

గులకరాళ్ల రహదారిపై తప్పని ఇబ్బందులు


పగులగొట్టిన రోడ్డుపై వెళ్తున్న ట్రాక్టరు

కొండాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో గులకరాళ్ల రహదారిని పగులగొట్టి అలాగే వదిలేయడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నేటికీ ఈ రహదారి మరమ్మతులకు నోచుకోలేదు. మండలంలోని ఆదిమూర్తిపురం నుండి గరిమెనపెంట వరకు ఆర్ అండ్ బీ రోడ్డులో ఏర్పడిన గుంతలమయం అయింది. రెండు సంవత్సరాల క్రితం మరమ్మతు పనులు మొదలుపెట్టారు. సగం చేసి అర్ధంతరంగా ఆపేయడంతో వాహనచోదకులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గులకరాళ్ల రోడ్డుపై తప్పని ఇబ్బందులు

మండలంలోని ఆదిమూర్తిపురం నుండి గరిమెనపెంట వరకు దాదాపు 15 కిలోమీటర్ల మేర రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. గత ప్రభుత్వ హయాంలో నూతనంగా రోడ్లను వేయకపోగా కనీసం ఉన్న గుంతలను కూడా పూడ్చలేదు. ఈక్రమంలో ఆదిమూర్తిపురంనుండి గరిమెనపెంట వరకు ఉన్న ఆర్అండ్ బీ రోడ్డులో గుంతలను కాంట్రాక్టరు సుమారు రెండు సంవత్సరాల క్రితం పగులగొట్టి గ్రావెల్ తోలి రోలర్‌తో తొక్కించారు. అలాగే డస్ట్‌ను వేయించి వదిలివేశారు. ఇప్పటివరకు తారువేయకపోవడంతో ఆ రోడ్డుపై ప్రయాణికులు దుమ్ము ధూళి, గులకరాళ్లతో ప్రయాణంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంనుండి చింతలదీవి, తూర్పు ఎర్రబల్లి, వెళిగండ్ల, ఉప్పలూరు, గరిమెనపెంట, గొట్టిగుండాల, గొట్టిగుండాలపాలెం తదితర పంచాయతీల్లో విధులు నిర్వర్తించే సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పాటు ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు దుమ్ము గులకరాళ్లు తగిలి అదుపుతప్పి ప్రమాదాలకు లోనవుతున్నారు. రెండేళ్లు గడచినా రోడ్డుకు తారు వేయకపోవడంపై వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పాలకులు ఇప్పటికైనా స్పందించి సదరు కాంట్రాక్టరుపై చర్యలు తీసుకొని పగులగొట్టిన చోట్ల తారు వేయించి ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.

రైతులకు యూరియా పంపిణీ

కొండాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం భీమవర ప్పాడు గ్రామ టీడీపీ నా యకుడు మామిళ్లపల్లి వెం కటేశ్వర్లు రాయితీపై రైతు లకు యూరియా బస్తాలు పంపిణీ చేశారు. బయటి మార్కెట్లో యూరియా ధర ఎక్కువగా ఉండటంతో రూ.280కే ప్రభుత్వం యూరియా అందిస్తోందన్నారు. పార్లపల్లిలో రైతుసేవాకేంద్రం ఉండగా భీమవరప్పాడు గ్రామంనుండి అక్కడకువెళ్లి యూరియా తెచ్చుకు నేందుకు ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకు వెళ్లగా 400 బస్తాల యూరియాను గ్రామానికే పంపిం చేలా చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో వీఏఏ వెంగ మ్మ, రైతులు మాల్యాద్రి, మాధవ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొందిన నాగేశ్వరరావుకు సత్కారం


నాగేశ్వరరావును సత్కరిస్తున్న అధికారులు

కావలి, నవంబరు13(ఆంధ్రజ్యోతి): కావలి పురపాలకసంఘంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ పుత్తూరు మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొందిన డీవీ నాగేశ్వరరావును గురు వారం సాయంత్రం కావలి మున్సిపల్ కార్యా లయంలో అధికారులు సత్కరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కావలి మున్సిపల్ కమిషనర్ జీ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ కావలి పురపాలకసంఘంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఆయన చేసిన సేవలను కొని యాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ పీ. సాయిరాం, టీపీవో ఏ వివేకానందకుమార్, మేనేజరు ఫణికుమార్. ఆర్వో ఎండీ అలీం, జేఏవో సుప్రజ, ఏఈలు వినోద్, షైనీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

వావిలి కుటుంబానికి పలువురి పరామర్శ

బిట్రగుంట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం జువ్వలదిన్నె పంచాయతీ తాటిచెట్లపాలెంకు చెందిన మత్స్యకార నాయకుడు వావిలి చిట్టిబాబు తల్లి వావిలి మస్తానమ్మ (76) ఇటీవల మృతి చెందడంతో గురువారం పలువురు నేతలు పరామర్శించారు. విషయం తెలుసుకున్న మాజీఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్దన్‌రెడ్డి చిట్టిబాబును పరామర్శించారు. మస్తానమ్మ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. స్థానిక సర్పంచ్ కుమారి గిరిబాబు, రాష్ట్ర ఆబ్కాఫ్ మాజీ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, మాజీ ఎంపీటీసీ బుర్ల శరత్‌చంద్రారెడ్డి, చెన్నాయపాలెం మాజీ సర్పంచ్ బాబు మస్తానమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. నాగులవరం పీఏసీఎస్ సభ్యుడు వాయిల సుధాకర్, చిట్టిబాబును పరామర్శించారు.

సత్యనారాయణ, కనకదుర్గమ్మకు పూజలు


పూజలు నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

బిట్రగుంట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కోవూరుపల్లిలోని నాటక రాణిపోలయ్య, బుజ్జమ్మ దంపతుల ఆధ్వర్యంలో గురువారం కార్తీకమాసం సందర్భంగా సత్యనారాయణ, కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదగిరి ఆంజనేయ వరప్రసాదాచార్యులు, గురుస్వామి దొడ్ల అంజయ్య యాదవ్‌స్వామి శాస్త్రోక్తంగా కలశ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాటక రాణిపద్మ, టీడీపీ నేత ఎన్ శీనయ్య, రంగయ్య, శ్రీనివాసులుస్వామి తదితరులు పాల్గొన్నారు. అయ్యప్ప భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

ఎమ్మెల్యే ఇంటూరిని విమర్శిస్తే సహించం

కందుకూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కనిగిరి ఎమ్మెల్యేగా అక్కడ అవినీతిలో మునిగితేలిన బుర్రా మధుసూదన్‌యాదవ్ కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుపై విమర్శలు చేస్తే సహించేది లేదని టీడీపీ నాయకులు హెచ్చరించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మండల టీడీపీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, దామా మల్లేశ్వరరావు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, మాదాల లక్ష్మీనరసింహ్మం, పూరిమిట్ల గురునాథం, పార్టీ నాయకులు చిలకపాటి మధుబాబు, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, కల్లూరి శైలజ తదితరులు మాట్లాడుతూ బుర్రా అవినీతి గురించి కనిగిరి ప్రజలు ఇప్పటికీ కథలు కథలుగా చెప్పుకుంటున్నారని, అవినీతి జరుగుతున్నట్లు ఒక్క ఆధారమైనా చూపించకుండా ఇంటూరి నాగేశ్వరరావు అవినీతికి పాల్పడుతున్నట్లు విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. కందుకూరులో అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు షేక్ సలాం, ముచ్చు శ్రీనివాసరావు, చిత్తూరి మల్లిఖార్జున, పులి నాగరాజు, షేక్ రూబీ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కష్టమే.. నేటి విజయానికి పునాది!


ప్రమాణస్వీకారం చేస్తున్న కావలి పట్టణ టీడీపీ నేతలు

కావలి, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తల కష్టమే నేటి విజయానికి పునాది అని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కావలి టీడీపీ కార్యాలయంలో గురువారం కావలి నియోజకవర్గంలోని పట్టణ కమిటీ నాయకుల క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, కో ఇన్‌చార్జిలు వార్డుల బాధ్యు లచే ఎమ్మెల్యే వైభవంగా ప్రమాణస్వీకారం చేయిం చారు. ముందుగా పార్టీ నాయకులతో కలిసి పార్టీ జెం డాను ఆవిష్కరించి, అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలు, నేతలకు తినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి శ్రీరామరక్ష అని, వారి కృషి ఎప్పటికీ మరవలేమన్నారు. పార్టీ కష్టాలలో ఉన్నపుడు పనిచేసిన వారందరికీ పదవులలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. పార్టీలో నిజాయితీతో పనిచేసే వారికి ఎల్లప్పుడు అండగా ఉంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని కావలి పట్టణ కార్యవర్గం, టీడీపీ సీనియర్ నాయకులు క్లస్టర్, కో క్లస్టర్ ఇన్‌చార్జిలు, కో యూనిట్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

● మాజీ ఎమ్మెల్యే మతిభ్రమించి మాట్లాడుతున్నారు...

మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి చెన్నాయపాలెం భూములపై మతి భ్రమించి మాట్లాడుతున్నారని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కావలి టీడీపీ కార్యాలయంలో గురువారం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ అనంతరం ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ హయాంలో చేసిన దోపిడీలకు ప్రజలు ఛీ కొట్టడంతో ఉనికిని కాపాడుకునేందుకు ప్రతాప్ ఏదేదో మాట్లాడుతున్నారన్నారు. చెన్నాయపాలెం భూములకు ఇప్పటికీ రేటు నిర్ణయించలేదని, వాటిని ఇంకా తీసుకోలేదన్నారు. భూములు తీసుకోకుండా, పరిశ్రమలు నెలకొల్పకుండా ఇంటికో ఉద్యోగం ఎలా వస్తుందన్నారు. గత వైసీపీ పాలనలో ఆనెడుగు, సర్వాయపాలెం భూములను ఇండోసెల్ కంపెనీకి ఇచ్చారని, ఇండోసెల్‌ను కరేడు వైపు పంపి ఇక్కడ బీపీసీఎల్ కంపెనీ తెస్తున్నారన్నారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు భూములకు ధరలు నిర్ణయించి పరిహారం ఇస్తారన్నారు. వారికి మంచి ధరలు వచ్చేందుకు తాను ముఖ్యమంత్రితో మాట్లాడతానన్నారు.

● సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కావలి నియోజకవర్గంలో 21 మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద గురువారం రూ.13,48,805 చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. జిల్లాలో కావలి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నీటి యాజమాన్యం ఎలా!?

(5వ పేజీ తరువాయి)

చాలా కాలం నుంచి జిల్లాలో శిస్తు వసూలు జరగడం లేదు. సాగు నీటి సంఘాలు లేకపోవడంతో శిస్తు వసూళ్లను ఎవరూ పట్టించుకోలేదు. సుమారు రూ.50 కోట్ల వరకూ జిల్లాలో శిస్తు వసూళ్లు జరగాల్సి ఉంది. అయితే గతేడాది సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిగి పాలక వర్గాలు రావడంతో శిస్తు వసూళ్లపై దృష్టి పెట్టారు. రైతులు కూడా శిస్తు చెల్లించేందుకు ముందుకొస్తున్నారు. కానీ కట్టించుకునేవారు కరువయ్యారు. శిస్తు పన్ను కట్టించుకునే వెబ్‌సైట్ పనిచేయడం లేదని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. మాన్యువల్‌గా కట్టించుకునేందుకు నిరాకరిస్తున్నారు.



స్వామి దర్శనంతో ప్రశాంతత

'తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రతిసారి ప్రశాంతత లభిస్తుంది. పీస్ ఆఫ్ మైండ్‌తో తిరిగి ఇంటికి వెళతాం' అని నటి అంజలి అన్నారు. నటుడు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి గురువారం ఉదయం ఆమె స్వామిని దర్శించుకున్నారు. తన సినిమాల వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామన్నారు. శ్రీవారి నిజరూప దర్శనం చేసుకోవడం చాలా ఆనందంగా ఉందని నటుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రసాదాలు చాలా బాగున్నాయన్నారు. ఆలయం ముందు వీరిని చూసేందుకు సినీ అభిమానులు పోటీపడ్డారు. సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ముసుగేసిన మంచు





తిరుపతి నగరాన్ని పొగమంచు కప్పేసింది. గురువారం ఉదయం మరింత ఎక్కువగా మంచు కనిపించింది. ఈ మంచు చాటున శేషాచల కొండ, గరుడవారధి, రహదారులు, రైల్వేట్రాక్, బహుళ అంతస్తుల భవనాలు, వాహనాల రాకపోకలు కనువిందుచేశాయి. మంచుతెరల్లో బాల సురీడు రూపం అలరించింది. చలి కాస్త పెరిగింది. ఉదయం 10 గంటల తర్వాత పొంగమంచు వీడి యథావిధి వాతావరణం నెలకొంది.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

అలిపిరి పాదాల మండపానికి

పూర్వ వైభవం

సందర్శించిన ఏఎస్ఐ బృందం

త్వరలో ప్రారంభంకానున్న పునర్నిర్మాణం పునులు

తిరుమల, నవంబరు13(ఆంధ్రజ్యోతి): అలిపిరిలో కూలిపోయే స్థితిలోవున్న పాదాల మండపం ప్రాచీన వైభవం చెక్కుచెదరకుండా పునర్నిర్మాణానికి తొలి అడుగు పడింది. గురువారం ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా(ఏఎస్ఐ) అధికారుల బృందం దీనిని పరిశీలించింది. ప్రత్యేక శ్రద్ధతో, శాస్త్రీయ పద్ధతిలో అవే రాళ్లు, స్తంభాలు వినియోగించే మండపాన్ని పునర్నించవచ్చని ఏఎస్ఐ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి ఆధ్వర్యంలోని బృందం అభిప్రాయపడింది. ఇందుకు రూ. 4కోట్లు వ్యయం కావచ్చని అంచనా వేశారు. పూణేకు చెందిన లార్డ్ వేంకటేశ్వర ఛారిటబుల్ అండ్ రిలీజియస్స్ ట్రస్టు నిర్వాహకులు వెంకటేశ్వర రావు ఈ మొత్తం భరించేందుకు ముందుకు వచ్చారు. శ్రీకాళహస్తిలో రూ.7 కోట్లతో లీకేజీ పనులు, సింహాచలం, శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాల్లో మరమ్మతు పనులను పురాతన పద్ధతిలో ఇప్పటికే వీరి ఆధ్వర్యంలో జరిగాయి. పాదాలమండపాన్ని పరిశీలించిన ఏఎస్ఐ బృందంలో బెంగుళూరు డిప్యూటీ ఇంజినీర్ జీ శ్రీనివాసులు, హైదరాబాద్ డిప్యూటీ ఇంజినీర్ కృష్ణచైతన్య కూడా ఉన్నారు. 450 ఏళ్ల క్రితం విజయనగర రాజుల కాలంలో పాదాలమండపాన్ని నిర్మించారు. పదేహేనేళ్లుగా రాళ్లు, పైపెచ్చులు, గోడలు పడిపోతూ ప్రమాదకరంగా మారింది. దీని స్థానంలో కొత్తది నిర్మించాలా, మరమ్మతులు చేయాలా అనే చర్చ జరిగింది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ అధికారులు ఆర్కియాలజీ విభాగం సంప్రతించడంతో ఈ బృందం తిరుపతికి వచ్చింది.



ఒక్క ఇటుకా కదిలించం



పాదాల మండపాన్ని పూర్తిగా కూలదోసి కొత్తది కడతారనే ప్రచారం నిజం కాదు. ప్రస్తుతం ఉన్న నిర్మాణంలోంచి ఒక్క ఇటుకను కూడా కదిలించబోము. ఇందులోని ప్రతీ రాయినీ, స్తంభాన్నీ యధాతధంగా వినియోగించుకుంటాం. వాటిపై నెంబర్లు వేసి తిరిగి వాటితోనే నిర్మాణం జరుగుతుంది. దాతకూడా ముందుకువచ్చారు. విధివిధానాలు పూర్తికాగానే పనులు ప్రారంభిస్తాం. పనులు పూర్తయితే మరో 700 ఏళ్ల దాకా అలిపిరి పాదాలమండపానికి ముప్పు ఉండదు.

- మునిరత్నంరెడ్డి, ఏఎస్ఐ డైరెక్టర్

'విశాఖ' ఎక్స్‌ప్రెస్ ఏసీ కోచ్‌లో పొగలు

● గంట ఆలస్యంగా నడచిన రైలు

తిరుపతి(సెంట్రల్), నవంబరు13(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి విశాఖ వెళ్లే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్(08548) ఏసీ కోచ్‌లో పొగలు వచ్చాయి. ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. విశాఖ నుంచి ఈ ప్రత్యేక రైలు గురువారం మధ్యాహ్నం తిరుపతికి చేరుకొంది. తిరిగి తిరుపతి రైల్వే స్టేషన్‌లో రాత్రి 9.50 గంటలకు 6వ నెంబరు ప్లాట్ ఫారం నుంచి బయలుదేరాలి. రైలు బయలుదేరిన వెంటనే బి-3 ఏసీ కోచ్‌లో సిబ్బంది ఏసీ ఆన్ చేశారు. ఆన్ చేసిన వెంటనే ప్యానల్ బోర్డులో ఉన్నపళంగా పొగలు రావడంతో ఏసీ సిబ్బంది, ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. సిబ్బంది చాకచక్యంగా చైన్‌పుల్ చేసి రైలును ఆపారు. ఎలాంటి మంటలు చెలరేగక పోవడంతో ప్రయాణికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు, ఎలక్ట్రికల్, ఇతర సాంకేతిక శాఖల సిబ్బంది అక్కడకు చేరుకొని మరమ్మతులు చేశారు. ఈ రైలు గంటకుపైగా ఆలస్యంతో బయలుదేరినట్లు ప్రయాణికులు తెలిపారు.

164 అదనపు పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 164 అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రాష్ట్ర ఎన్నికల అధికారికి ఆమోదం కోసం పంపినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం వివిధరాజకీయ పార్టీల నేతలతో పోలింగ్ కేంద్రాల సరళీకరణపై ఆయన సమీక్షించారు. 1,200 ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఈ ప్రతిపాదనలు పంపామన్నారు. 38 పోలింగ్ కేంద్రాల ప్రాంతాలు మార్పు, 9 పోలింగ్ కేంద్రాలు పేరుమార్పు, 44 పోలింగ్ కేంద్రాలు విలీనానికి ప్రణాళికలు సిద్ధంచేశామన్నారు. ప్రస్తుతమున్న 2,141 పోలింగ్‌కేంద్రాలకు గాను 2,261పోలింగ్ కేంద్రాలు పెరుగుతాయన్నారు. దీనిపై రాజకీయపార్టీల నేతలకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. ఈసమావేశంలో ఇన్‌ఛార్జి జేసీ మౌర్య, డీఆర్వో నరసింహులు, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాస్‌రెడ్డితో పాటు వివిధ రాజకీయపార్టీల నేతలు పాల్గొన్నారు.

చెత్త సేకరణకు ఈ ఆటోలు



తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 13(ఆంధ్ర జ్యోతి): జిల్లాలోని 20 గ్రామ పంచాయతీల్లో చెత్త సేకరణకు ఈ-ఆటోలు అందజేశారు. కలెక్టరేట్ వద్ద గురువారం వీటిని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆయా పంచాయతీలకు అందజేశారు. దళిత గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పరిచేందుకు వీటిని తీసుకొచ్చామన్నారు. గ్రీన్ అంబాసిడర్ల ద్వారా చెత్త సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీపీవో సుశీలాదేవి, జిల్లా సాంఘిక సంక్షేమాధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఈ ఆటోలను అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఏఎస్పీగా శ్రీనివాసులు



తిరుపతి(నేరవిభాగం), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): డీజీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న శ్రీనివాసులను తిరుపతి జిల్లాకు అదనపు ఎస్పీగా బదిలీ చేశారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. రెండు మూడు రోజుల్లో ఆయన బాధ్యతలు తీసుకోనున్నారు.

అమ్మవారి బ్రహ్మోత్సవాలకు 16న అంకురార్పణ

తిరుచానూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు 17 నుంచి 25వ తేదీ వరకు జరగనున్నాయి. అందులో భాగంగా 16వతేదీ ఉత్సవాలకు అంకురార్పణ నిర్వహించనున్నారు. అదేరోజు ఉదయం అమ్మవారి ఆలయంలో లక్ష కుంకుమార్చన నిర్వహిస్తారు. మరుసటిరోజు 17న సోమవారం ధ్వజారోహణంతో అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరులోని ఎంకేటీ మహల్‌లో శనివారం నిర్వహించే ఉద్యోగ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. శ్రీసిటీ, మేనకూరుసెజ్, ఈఎంసీ క్లస్టర్, తిరపతి, చెన్నైలోని 15 బహుళ జాతీయ కంపెనీల్లో సుమారు 760కిపైగా ఉద్యోగాలకోసం ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదేని డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణతసాధించిన వారు ఉదయం 8గంటలకు మేళాలో పాల్గొనవచ్చన్నారు. సంబంధిత లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94403 74535లో సంప్రదించాలన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం తదితరులు పాల్గొన్నారు.



మూడు నెలలకే గుంతలు

● తిరుమల రెండో ఘాట్‌లో తిరిగి మరమ్మతులు

తిరుమల, నవంబరు13(ఆంధ్రజ్యోతి): తిరుమల రెండో ఘాట్‌లో కొత్త రోడ్డు వేసి మూడు నెలలు కాకముందే గుంతలయమైంది. భారీ వర్షాలు, అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలతో కొద్ది నెలలకే మరమ్మతులకు గురైంది. కొవిడ్ అనంతరం తిరుమలకు వచ్చే వాహనాల సంఖ్య పెరగడం, వరుస వర్షాలతో తిరుమల మొదటి, రెండో ఘాట్ రోడ్లు భారీగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఈక్రమంలోనే దాదాపు రూ.10 కోట్లతో రెండు ఘాట్‌రోడ్ల మరమ్మతుల కోసం టీటీడీ బోర్డు ఈ ఏడాది ప్రారంభంలో తీర్మానం చేసి కాంట్రాక్టు ఇచ్చింది. తొలుత తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండో ఘాట్‌లో నూతన రోడ్డు ప్రారంభించి బ్రహ్మోత్సవాల ముందు పూర్తి చేశారు. పూర్తిస్థాయిలో ఘాట్‌రోడ్డు సిద్ధమైందనుకున్న లోపే ఇటీవల భారీ వర్షాలు కురిశాయి. దీంతో నూతన రోడ్డులోనూ గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న క్రమంలో టీటీడీ తిరిగి మరమ్మతు పనులను ప్రారంభించింది. వర్షాలు అధికంగా కురవడం, నేషనల్ హైవే కంటే అధికంగా వాహనాల రాకపోకలు ఉన్న క్రమంలో రోడ్డు దెబ్బతిందని అధికారులు చెబుతున్నారు. శుక్రవారం సాయంత్రానికి ఈ మరమ్మతులు పూర్తవుతాయన్నారు. మరోవైపు కొత్త రోడ్డు ఇంత తక్కువ సమయంలో పాడవడమేంటనే విమర్శలు వినిపిస్తున్నాయి.



అంతా మీ చేతిలోనే ఉంది

నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం ● జాగ్రత్తలే శ్రీరామరక్ష

మధుమేహం అంటే..

మన రక్తంలో గ్లూకోజ్(చక్కెర) స్థాయి ఎక్కువగా ఉండే స్థితిని మధుమేహం (డయాబెటిక్) అంటారు. ఇన్సులిన్ అనే హార్మోన్ తగినంతగా శరీరంలో ఉత్పత్తి కాకపోవడం, కణాలు దానికి సరిగ్గా స్పందించక పోవడం వలన గ్లూకోజ్ స్థాయి పెరిగి మధుమేహంగా మారుతుంది.

తిరుపతి(వైద్యం), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మధుమేహం(డయాబెటిక్) జీవితకాల సమస్యే కానీ, తగిన జాగ్రత్తలో నియంత్రించుకుంటే ఆరోగ్యానికి ముప్పు ఉండదు. తీసుకునే ఆహారం, శారీరక వ్యాయామం ఇవి రెండూ నియంత్రణలో కీలకం. జీవనశైలిలో, ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పుల ఫలితంగా ప్రజల్లో మధుమేహం పెరుగుతోంది. మధుమేహం వ్యాప్తిస్తున్న దేశాల్లో మన దేశం మొదటి స్థానంలో ఉంటే, దేశంలో మన రాష్ట్రం రెండో స్థానంలో ఉంది. రాష్ట్రంలో మన జిల్లా నాలుగో స్థానంలో ఉంది. తిరుపతి జిల్లాలో 1,22,245 మంది మధుమేహంతో బాధపడుతున్నారని లెక్కలు చెబుతున్నాయి. ఇది టెస్ట్ చేసుకుని మధుమేహం నిర్ధారణ అయినవారి సంఖ్య. టెస్ట్ చేయించుకోనివారిలో ఈ వ్యాధి ఎంతమందికి ఉందో అంచనా కట్టలేం.

లక్షణాలు:

ఎక్కువగా మూత్ర విసర్జన, అధికంగా దాహం, ఆకలి వేయడంతో పాటు బరువు తగ్గడం, దృష్టిలోపం, అలసట, గాయాలు మానకపోవడం, చర్మం దురదగా అనిపించడం.

రెండు రకాలు :

ఒకటి గర్భంతో ఉన్న వారికి, పురిటి పిల్లలకు వస్తుంది. వీరు వైద్యుల సలహాలు పాటించి ఆహారం విషయంలో సరైన జాగ్రత్తలు పాటించడం వలన కాన్పు తరువాత, బిడ్డ పుట్టిన నెల తరువాత వీరు సాధారణ పరిస్థితికి వస్తారు.

రెండో దశలో వచ్చే మధుమేహం జీవితకాలం మనతోనే ఉంటుంది. దీనిని కేవలం మందులు, సరైన ఆహారం, వ్యాయామాలతో అదుపులో ఉంచుకోవచ్చు.

జాగ్రత్తలు పాటించకపోతే..

మధుమేహంతో బాధపడే వారు సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే, వైద్యుల సూచనలు పాటించకపోతే నియంత్రణ సాధ్యంకాదు. దీని ప్రభావం శరీరంలోని పలు అవయవాలపై పడి వాటిని దెబ్బతీయడంతోపాటు చివరకు ప్రాణాలే బలిఅవుతాయి. ప్రధానంగా గుండెపోటు, పక్షవాతం, నరాలు దెబ్బతినడం(డయాబెటిక్ న్యూరోపతి), కిడ్నీ సమస్యలు, దృష్టిలోపం(డయాబెటిక్ రెటినోపతి) వంటి ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. పాదాల, చర్మ, దంతాల, జీర్ణ, లైంగిక, మానసిక సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది.

పూర్తిగా నయం చేస్తామనేవారి మాటలు నమ్మొద్దు



ప్రస్తుత జీవన విధానంలో వయస్సుతో సంబంధం లేకుండా మధుమేహం బారిన పడుతున్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి మధుమేహ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం సురక్షితం. అలాగే మధుమేహ బాధితులు 3-4 నెలలకు ఒకసారి అవసరమైతే రెండు వారాలకు ఒకసారి ఈ పరీక్షలు చేసుకుంటూ తగు జాగ్రత్తలు పాటించాలి. మధుమేహాన్ని పూర్తిగా తగ్గిస్తామనే వారి మాటలు నమ్మి నాటు మందులు, ఇతర కషాయాలు వాడి ప్రాణాల మీదకు తెచ్చుకోకండి.

- డాక్టర్ అలోక్ సచిన్, ఎండోక్రైనాలజీ విభాగాధిపతి, స్విమ్స్

సొంత నిర్ణయాలు వద్దు



మధుమేహంతో తీవ్రంగా ఇబ్బంది పడే వారు అన్ని విభాగాల డాక్టర్లు అందుబాటులో ఉండే ఆస్పత్రుల్లో మాత్రమే చూపించుకోవడం సురక్షితం. మధుమేహ బాధితులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ఖరీదైన మందులు, ఇన్సులిన్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. వీటిని కూడా డాక్టర్లు చెప్పిన విధంగానే వాడాలి. ప్రధానంగా మధుమేహ బాధితులు ఆహారం, వైద్యం వంటి విషయాల్లో సొంత నిర్ణయాలు తీసుకోకూడదు.

- డాక్టర్ తులసీరాం, ప్రొఫెసర్ ఆఫ్ జనరల్ మెడిసిన్, రుయాస్పత్రి

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

● క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. నడక వల్ల ప్రయోజనం ఉంటుంది.
● ఒత్తిడిని తగ్గించుకోవాలి. ● చక్కెరతో చేసిన పదార్థాలు, స్వీట్లు, సిరప్‌లు వంటి వాటి జోలికి పోరాదు.
● ఫైబర్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి.
● క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి.





వేములపాటి అజయ్ - వెంకటేష్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్, అల్లు అర్జున్ సోదరుడు అల్లు వెంకటేష్ దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

శ్రీహరి సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 21 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.54 కోట్లు
బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,283
తలనీలాలు సమర్పించినవారు: 22,583

'పద్మావతి'లో 'నృత్య వాహిని'





తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో 'నృత్య వాహిని' మొదలైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని గురువారం వీసీ ఉమ ప్రారంభించారు. కళల ద్వారా మనుషుల్లో సమైక్యతా భావన పెంపొందుతుందని అభిప్రాయపడ్డారు. దేశ, విదేశీ ప్రతినిధులతో నృత్యోత్సవం నిర్వహించడం ద్వారా యూనివర్సిటీ విద్యార్థినుల్లో ఉత్తేజం కలుగుతుందన్నారు. మనకు వారసత్వంగా సంక్రమించిన నృత్యాలను పరిరక్షించుకోవాలని, దీనికి యూనివర్సిటీలో సంగీత, నృత్య విభాగం ఎంతో కృషి చేస్తుందన్నారు. నృత్యాలను కాపాడుకోవడం అంటే మన సంస్కృతిని కాపాడుకోవడం అవుతుందని మైసూరు వర్సిటీ ప్రొఫెసర్ శ్రీధర్ అన్నారు. ఆయా ప్రాంతాల ప్రతినిధులు వివిధ నృత్య రీతులతో అలరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజని, హ్యూమనిటీస్ డీన్ వాణి, అంతర్జాతీయ డీన్ విజయలక్ష్మి, ప్రోగ్రాం ఆర్గనైజింగ్ కార్యదర్శి హిమబిందు, దేశ, విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు.



నృత్య కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ ఉమ

ఇథనాల్ ప్లాంట్‌పై ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న జడ్పీటీసీ కట్టా జ్యోతి, వేదికపై ఆర్డీవో కిరణ్మయి, కాలుష్యనియంత్రణ శాఖ ఈఈ ఆదిశేఖర్

నాయుడుపేట టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట-మేనకూరు సెజ్‌లోని కోనేటిరాజుపాళెంలో గురువారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరిగింది. ఆర్డీవో కిరణ్మయి అధ్యక్షత వహించారు. అటవీశాఖ సమక్షంలో నయరా ఎనర్జీ లిమిటెడ్ పరిశ్రమకు సంబంధించి ప్రజల అభిప్రాయాన్ని సేకరించారు. 400 కెఎల్‌పీడీ నూరుశాతం సామర్థ్యంతో ఇథనాల్ తయారీతోపాటు 10.3 మెగావాట్ల జనరేషన్ పవర్‌ప్లాంట్ పరిశ్రమ ఏర్పాటవుతుందని ఆర్డీవో తెలిపారు. పరిశ్రమకు సంబంధించి పూర్తి వివరాలను యాజమాన్యం ప్రతినిధి సుజిత్‌తోపాటు పలువురు వెల్లడించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేస్తున్న యాజమాన్య ప్రతినిధులు సమీపంలోని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని జడ్పీటీసీ జ్యోతి, మాజీ జడ్పీటీసీ శ్రీరాం ప్రసాద్‌లు కోరారు. అనంతరం సర్పంచ్ సురేష్ మాట్లాడుతూ గ్రామంలో అనేక మంది రైతులకు సంబంధించి ఇరిగేషన్ పరిధిలోని లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుకు రహదారుల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులను సమకూర్చాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు రాజేంద్ర, సీఐ సంఘమేశ్వరరావు, ఓజిలి ఎస్ఐ శ్రీకాంత్, మాజీ సీడీసీ చైర్మన్ కట్టా సుధాకర్‌రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

భార్యపై కోపంతో అత్తింటికి నిప్పు

కోట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవపడి ఓ వ్యక్తి అత్త వారింటికి పెట్రోలు పోసి నిప్పు పెట్టిన వైనమిది. అదృష్టవశాత్తూ ప్రాణ నష్టం జరగలేదు. పోలీసుల కథనం ప్రకారం వివరాలివి. చిల్లకూరు మండలం వల్లివేడుకు చెందిన ఏడుకొండలికి కోట మండలం కొత్తపాలేనికి చెందిన శిరీషతో ఐదేళ్ల క్రితం పెళ్లయింది. రెండేళ్ల నుంచి అనుమానంతో భార్యను వేధిస్తున్నాడు. దీంతో ఆమె కొద్దిరోజుల క్రితం పుట్టింటికి వచ్చేసింది. గురువారం ఏడుకొండలు అత్తవారింటికి వచ్చాడు. భార్యతో గొడవ పడి కొట్టాడు. ఆమె కోపంతో మరో గదిలోకి వెళ్లిపోయింది. ఈలోగా ఏడుకొండలు వెంట తెచ్చుకున్న పెట్రోలు తీసి గదిలో పోసి నిప్పంటించాడు. ఇంట్లో వారు గుర్తించి ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. అయితే గదిలో అప్పటికే రూ.4లక్షల విలువైన ఫర్నిచర్ దగ్ధమైంది. అగ్నిమాపక శకటం వెళ్లి మంటలను ఆర్పివేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

రాయలచెరువు ముంపు బాధితులకు రూ.14.5 లక్షల సాయం

● బైర్గన్ పరిశ్రమ ఉదారత



వరదసాయంతో పాటు వివిధవస్తువులు కలెక్టర్‌కు అందజేస్తున్న నిర్వాహకులు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కేవీబీ పురం మండలం ఓళూరు రాయలచెరువు కట్ట తెగిన ఘటనలో ముంపుబారిన పడిన కళత్తూరు హరిజనవాడ, మరో రెండు గ్రామాల బాధితులకు రూ.14.5 లక్షల సాయం అందింది. శ్రీసిటీలోని బైర్గన్ పైప్ సపోర్ట్ పరిశ్రమ నిర్వాహకులు రూ.10లక్షల సాయంతో పాటు రూ.4.5 లక్షల విలువైన 1,200 ఎల్ఈడీ బల్బులు, 750 దుప్పట్లు, 75 టేబుల్‌ఫ్యాన్లు అందజేశారు. వీటిని ఆ పరిశ్రమ ప్రతినిధి అల్తాఫ్ గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందించారు. ఆ పరిశ్రమ ఉదారతను కొనియాడుతూ.. మరికొంతమంది సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చి బాధితులను ఆదుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

'అరణియార్'లోకి ఆరు లక్షల చేప పిల్లలు



రిజర్వాయర్‌లో చేప పిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరులోని అరణియార్ ప్రాజెక్టులోకి నీళ్లు చేరడంతో గురువారం ఆరు లక్షల చేపల పిల్లలను వదిలారు. మరో ఐదు రోజుల్లో ఇంకో నాలుగు లక్షల చేప పిల్లలు వదలనున్నారు. ఈ రిజర్వాయరులోని చేపలకు అటు చెన్నై, ఇటు నెల్లూరు, తిరుపతిలో మంచి గిరాకీ ఉందని ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. ఈ చేపలకు మార్కెట్ కల్పిస్తే మత్స్యకారుల కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, డీఎఫ్‌వో శాంతి, ఎఫ్‌డీవో మధుసూదన్, ఇరిగేషన్ డీఈ శ్రీనివాసులు, ఎంపీడీవో మహ్మద్‌రఫి, అరణియార్ ఆయకట్టు చైర్మన్ రవిరెడ్డి, నాయకులు వాసురెడ్డి, ఎస్.ఎం. సురేష్, సుమాంజలి, మునిశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఐసర్‌లో భారత శాస్త్ర అకాడమీ సదస్సు

● 150 మంది శాస్త్రవేత్తల రాక



ఏర్పేడు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు సమీపంలోని ఐసర్‌లో బెంగళూరుకు చెందిన భారత శాస్త్ర అకాడమీ ఆధ్వర్యంలో 91వ వార్షిక సదస్సు శుక్రవారం నుంచి 16వ తేదీ వరకు జరగనుంది. మూడు రోజుల పాటు తిరుపతి ఐసర్‌లో జరగనుంది. సర్ సీవీ రామన్ 1934లో స్థాపించిన ఈ అకాడమీ.. దేశంలో శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి కృషి చేస్తోంది. ఈ అకాడమీ శాస్త్రీయ ఆలోచన, జ్ఞాన మార్పిడి, విజ్ఞాన విద్య, పరిశోధనలను దేశవ్యాప్తంగా అభివృద్ధి పరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ క్రమంలో జరిగే 91వ వార్షిక సదస్సులో దేశంలోని 150మంది ప్రముఖ శాస్త్రవేత్తలు పాల్గొని.. పరిశోధనలను పరిచయం చేస్తారు. అకాడమీ ఫెలోషిప్ అసోసియేట్లు, పరిశోధకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆహ్వానితులు శాస్త్రీయ చర్చలు, ఆలోచనల మార్పిడి జరుపుతారు. ఐఐఎస్‌సీ బెంగళూరుకు చెందిన ప్రొఫెసర్ రాఘవన్ వరదరాజన్ 'వైరల్ వ్యాక్సిన్ల స్థిరత్వం, ప్రభావాన్ని పెంపొందించడం' అంశంపై అధ్యక్ష ప్రసంగం చేస్తారు. పబ్లిక్ లెక్చర్‌గా 'ఏఐ ఫర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్'పై ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్ కల్యాణ రామన్ మాట్లాడనున్నారు. ప్రత్యేక సింపోజియాలు, లెక్చర్లతో పాటు లీలావతీస్ డాటర్స్ పుస్తకాన్ని కన్నడ, ఒరియా భాషల్లో ఆవిష్కరిస్తారు. విద్యార్థుల కోసం విజ్ఞాన కథలు పేరుతో మధ్య పాఠశాల విద్యార్థుల కోసం విజ్ఞాన అవగాహన కార్యక్రమం 14, 15 తేదీల్లో అవుట్‌రీచ్ కార్యక్రమం ఉంటుంది. అకాడమీ అధికార యూట్యూబ్ ఛానల్ ద్వారా ఈ కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

సదస్సులో నేడు: శుక్రవారం ఉదయం 8.45గంటలకు రిజిస్ట్రేషన్, 9.10 నుంచి 10.30 వరకు బెంగళూరు ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ రాఘవన్ వరదరాజన్ అధ్యక్ష ప్రసంగం, 11.45గంటలకు ప్రజా ఉపన్యాసం, 12.30గంటలకు గ్రూప్ ఫొటో, 2 గంటలకు ఫెలోస్ ఉపన్యాసాలు, 3.20గంటలకు టీ విరామం, 4గంటలకు ఫరీదాబాద్ టీహెచ్ఎస్‌టీఐ ప్రొఫెసర్ డాక్టర్ శింజని భట్నాగర్ ఉపన్యాసం, 4.40గంటలకు ప్రత్యేక సమావేశం, 6.10 గంటలకు ఫెలోస్ ఉపన్యాసాలు,

లారీ చోరీ కేసులో క్లీనర్ అరెస్టు



దొంగ అరెస్టును చూపుతున్న డీఎస్పీ

శ్రీకాళహస్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తాను క్లీనర్‌గా పనిచేస్తున్న లారీని డ్రైవర్ లేని సమయంలో చోరీకి పాల్పడ్డ వ్యక్తిని పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి గురువారం మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. పలమనేరుకు చెందిన మధుసూదన్‌నాయుడు లారీ యజమానిగా వస్తు రవాణా సాగిస్తుంటాడు. శ్రీకాళహస్తి పట్టణం కొత్తపేటకు చెందిన కన్నయ్యనాయుడు ఆ లారీకి డ్రైవర్‌గా, ఇదే పట్టణం బహదూరుపేటకు చెందిన జయచంద్ర(45) క్లీనర్‌గా పని చేస్తుండేవాడు. వారం రోజుల క్రితం నెల్లూరు నుంచి ఖాళీ లారీతో పలమనేరుకు వెళుతూ శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని బసవయ్యపాళెం వద్ద విశ్రాంతి కోసం ఆగారు. ఈ సమయంలో డ్రైవర్ కన్నయ్యనాయుడు ఇంటికి వెళ్లడంతో క్లీనర్ జయచంద్ర లారీని చోరీ చేశాడు. యజమాని మధుసూదన్‌నాయుడు ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి 2వ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తొట్టంబేడు మండలం కన్నలి ఎస్టీకాలనీ వద్ద గురువారం లారీ సహా క్లీనర్ జయచంద్రను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ వెల్లడించారు.

'గ్రేటర్'లో విలీనానికి కరకంబాడి ఓకే

రేణిగుంట/తిరుపతి రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనానికి కరకంబాడి పంచాయతీ బోర్డు ఆమోదించింది. కలెక్టర్ ఆదేశాలు మేరకు రేణిగుంట మండలం పరిధిలోని కరకంబాడి, రేణిగుంట, గాజులమండ్యం పంచాయతీల సర్పంచుల అధ్యక్షతన, పంచాయతీ కార్యదర్శుల సమక్షంలో పంచాయతీ బోర్డు సమావేశం జరిగింది. ఇందులో కరకంబాడి పంచాయతీ పాలకమండలి కార్పొరేషన్‌లో విలీనానికి ఆమోదించారు. కోరం లేనందున రేణిగుంట పాలకమండలి సమావేశం వాయిదా పడింది.

మేము కలవలేం : తిరుపతిరూరల్‌మండలం రామానుజపల్లె పంచాయతీకార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో గ్రామసర్పంచ్, వార్డుసభ్యులు కలసి గ్రేటర్‌తిరుపతిలో విలీనానికి వ్యతిరేకంగా తీర్మానం చేశారు. గ్రామపంచాయతీగానే ఉంచాలని కోరారు.గ్రేటర్‌లో విలీనం చేయడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలపై పన్నులభారం పెరుగుతుందని, పలు సమస్యల కోసం కార్పొరేషన్ చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. ఈ మేరకు తీర్మాన పత్రాన్ని పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. సర్పంచ్ లీలారాణి, వైస్‌సర్పంచ్, వార్డుసభ్యులు, కార్యదర్శి విఠల్ పాల్గొన్నారు. రేణిగుంట మండలం గాజులమండ్యం పంచాయతీ పాలకమండలి కూడా కార్పొరేషన్‌లో విలీనాన్ని తిరస్కరించింది.

నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం

● డిస్కం సీఎండీ శివశంకర్



తిరుపతి(ఆటోనగర్), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని 9 జిల్లాల వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరంగా సరఫరా చేసే లక్ష్యంతో క్షేత్ర స్థాయిలో అధికారులు పనిచేయాలని ఆ సంస్థ సీఎండీ లోతేటి శివశంకర్ ఆదేశించారు. తిరుపతిలోని విద్యుత్ కార్పొరేట్ కార్యాలయంలో గురువారం డిప్యూటీ ఈఈలు, ఈఈలు, ఎస్ఈలు, జీఎం, సీజీఎం స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో వినియోగదారులకు అధికారులు అందుబాటులో ఉండి సత్వర సేవలందించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు రాకుండా లోడ్ నియంత్రణపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. డయల్ యువర్ సీఎండీ కార్యక్రమానికి వస్తున్న ఫిర్యాదుల సంఖ్యను తగ్గించాలని చెప్పారు. విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా ప్రజలకు, సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. సోలార్ విద్యుత్ వినియోగంపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు త్వరితగతిన వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేయాలన్నారు. 11కేవీ ఫీడర్లకు, డీటీఆర్‌లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలన్నారు. నెలవారీగా విద్యుత్ బిల్లులు 100 శాతం వసూలు చేయడానికి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యుత్ సర్వీసులకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ పది రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు పి.అయూబ్‌ఖాన్, కె.గురవయ్య, కె.రామమోహనరావు, సీజీఎంలు జె.రమణాదేవి, ఎన్.శోభావాలెంటీనా, ఎం.మురళీకుమార్, ఎం.ఉమాపతి, ఆదిశేషయ్య, జానకిరామ్, సురేంద్రనాయుడు పాల్గొన్నారు.

◆ నా మాటకు విలువలేనప్పుడు

ఎందుకీ ఇన్‌చార్జి పదవి?

● గంగమ్మ గుడిలో మెంబరునూ వేసుకోలేకపోయా
● టీడీపీ ముఖ్యనేతల ఎదుట సుగుణమ్మ ఆవేదన

తిరుపతి, నవంబరు13(ఆంధ్రజ్యోతి): 'తాతయ్య గుంట గంగమ్మ గుడిలో ఒక మెంబరునూ వేసుకోలేకపోయా. నాకు సమాచారం లేకుండానే కార్యక్రమాలు చేస్తున్నారు. నా మాటకు విలువ లేనప్పుడు నాకెందుకీ ఇన్‌చార్జి పదవి?' అంటూ ఏపీ జీబీసీ చైర్‌పర్సన్ సుగుణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య, నాలెడ్జ్ కమిటీ చైర్మన్ మాల్యాద్రి, బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాళెం విజయకుమార్ సమక్షంలో గురువారం తిరుపతిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన క్లస్టర్ ఇంచార్జిలు, కార్యకర్తల సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. '2019 ఎన్నికల్లో నేను గెలిచానో, ఓడిపోయానో అందరికీ తెలుసు. ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నిక వైసీపీ అధికారబలంతో రాష్ట్ర వ్యాప్తంగా చేజిక్కించుకుంది. అయితే తిరుపతి నియోజకవర్గాన్నే భూతద్దంలో చూపించారు. అయినా ప్రతిపక్షహోదాలో తిరుపతిలోని కేడర్‌ను కాపాడుకుంటూ వచ్చాను. 2024లో టికెట్ వస్తుందని ఆశించా. కూటమి పొత్తులో భాగంగా మిత్రపక్షమైన జనసేనకు సీటు పోయింది. ఆ సమయంలో కాస్త అసంతృప్తి చెందిన మాట వాస్తవమే. అవన్నీ పక్కన పెట్టి అందరినీ కలుపుకుని పోయి అత్యధిక మెజారిటీతో కూటమి అభ్యర్థిని గెలిపించుకున్నాం. ఈక్రమంలో వచ్చిన నామినేటెడ్ పోస్టులు కొంత అసంతృప్తి కలిగించాయి. గంగమ్మ గుడిలో మెంబరుగా కూడా నేను సూచించిన వ్యక్తికి రాకపోవడం బాధకలిగింది' అని సుగుణమ్మ వాపోయారు. వైసీపీ నాయకుల పట్ల కొందరు పోలీసులు వ్యవహరిస్తున్న తీరు చూస్తే అధికారంలో ఎవరున్నారన్న అనుమానం కలుగుతోందని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ అన్నారు. తిరుపతిలో జనసేన ఎమ్మెల్యే కావడంతో టీడీపీ శ్రేణులకు దిక్కులేకుండా పోయిందని నూరా సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. యాదవులంటే ఒకే కుటుంబమేనా? వారికే పదవులా? తిరుపతి టీడీపీలో ఇంకెవరూ లేరా అంటూ బీజీ కృష్ణ యాదవ్ ప్రశ్నించారు.

గ్రూపులు వదిలేయండి.

సుగుణమ్మ, ఆమె అల్లుడు సంజయ్ 2019 ఎన్నిక సరిగ్గా చేసుంటే ఇప్పుడు ఆమె మంత్రి అయ్యేవారని మాల్యాద్రి చెప్పారు. వర్ల రామయ్య మాట్లాడుతూ 2009లో ఎంపీగా పోటీ చేసినప్పుడు 45 నిమిషాలు ముందు చెబితే తాను నామినేషన్ వేశానని గుర్తుచేసుకున్నారు. కొందరి వల్ల ఓడిపోవాల్సి వచ్చిందని చెప్పుకొచ్చారు. గ్రూపులు వదిలేసి అందరినీ కలుపుకుని పోవాలని అటు సుగుణమ్మకు, ఇటు పార్టీ శ్రేణులకు వారు పిలుపునిచ్చారు. తిరుపతి ఇన్‌చార్జి సుగుణమ్మ ఆదేశాల ప్రకారం నాయకులు, కార్యకర్తలు నడుచుకోవాలని సూచించారు.



సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న వర్ల రామయ్య, టీడీపీ నేతలు

శివాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న మద్దాలి శ్రీనివాసులు, వెంకట నాగరాజు

సూళ్లూరుపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాహ్మణ వీధిలో రామాలయం శివాలయ ని ర్మాణం కోసం గురువారం పట్టణానికి చెందిన మ ద్దాలి శ్రీనివాసులు, వె ంకట నాగరాజులు రూ.లక్ష విరాళం కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కారంశెట్టి మల్లికార్జున రావు, ఎస్.శివ కుమార్ పాల్గొన్నారు.

నాయుడుపేటలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు



నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

నాయుడుపేట టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ పేలుడు ఘటన నేపథ్యంలో పట్టణంలోని రైల్వే స్టేషన్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో గురువారం డాగ్ స్క్వాతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పేలుడు పదార్థాలను గుర్తించడంలో ప్రత్యేక శిక్షణ పొందిన గిరి అనే డాగ్‌తో తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని అనుమానస్పదంగా కన్పించిన వ్యక్తుల వివరాలను సేకరించారు. ఎస్‌ఐ ఆదిలక్ష్మి, ట్రైనీ ఎస్‌ఐ భాను, భానుప్రసన్న, రైల్వే పోలీసులు పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడి పనిచేసినవారికి గుర్తింపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడి పనిచేసేవారికి ఎప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ మండల, క్లస్టర్, యూనిట్, వార్డు, బూత్ కమిటీల ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చేందుకు కష్టపడి పనిచేసిన టీడీపీ క్యాడర్‌ను పార్టీ ఎన్నటికీ మరిచిపోదన్నారు. కార్యకర్తల సంక్షేమానికి సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ ఎనలేని కృషిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, రాజశేఖర్‌రెడ్డి, కిషోర్‌నాయుడు, మధుసూదన్‌రెడ్డి, అబ్దుల్‌రహీం, బిల్లు చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరతలేదు : వ్యవసాయాధికారి



పీఏసీఎస్ కార్యాలయంలో స్టాక్ వివరాలు అడిగి తెలుసుకుంటున్న ప్రసాదరావు

గూడూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరతలేదని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాదరావు అన్నారు. గురువారం పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయం, పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గుర్తింపు కార్డుల ద్వారా ప్రతి ఎకరానికి మూడు బస్తాల యూరియాను సరఫరా చేస్తామన్నారు. ఎవరైనా ప్రైవేటు డీలర్లు నాశిరకం ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తే కఠిన చర్యలు చేపడుతామన్నారు. అధికారులు ధనుంజయరెడ్డి, గోపినాయక్, రమేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు అల్లూరు కరుణాకర్‌రెడ్డి, సీఈవో నారాయణ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మెహబూబి

గూడూరు అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని సీడీపీవో మెహబూబి అన్నారు. గురువారం నెల్లటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, బాలికల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు చదువులపై దృష్టిసారించి రాణించాలన్నారు. బాల్యవివాహాల వలన జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శారదాంబ, పార్వతమ్మ, హైమావతి, ఉమాదేవి, శోభారాణి, రమణకుమారి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి



అర్జీదారులతో మాట్లాడుతున్న సుబ్బరాయుడు

దక్కిలి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజావిజ్ఞప్తుల దినం (పీజీఆర్ ఎఐస్) కార్యక్రమంలో వినతలకు సత్వర పరిష్కారం చూపాలని డివిజనల్ సర్వే అధికారి సుబ్బరాయుడు పేర్కొన్నారు. నరసనాయుడుపల్లికి చెందిన వంటిమిట్ట గంగమ్మకు 18 ఏళ్ల క్రితం దక్కిలి గ్రామ సర్వే నంబరు 112లో 36 సెంట్లు వ్యవసాయ భూమికి పట్టా మంజూరు చేశారు. తన భూమి ఎక్కడుందో తెలపాలంటూ ఆమె కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈక్రమంలో విచారించగా ప్రస్తుతం ఆ భూమి సాగులో లేనందున పాఠశాల ఆటస్థలానికి కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టాలు పొందిన లబ్దిదారులు సాగులో ఉండాలని చెప్పారు. ఏళ్ల తరబడి సాగులో లేకపోతే ఇలాంటి పరిస్థితులే ఎదురవుతాయని చెప్పారు. మండల సర్వేయర్ పెంచలయ్య, గ్రామ సర్వేయర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు



పాతనాలపాడులో ప్రభుత్వ భూమిలో అక్రమంగా వేసిన నిమ్మ మొక్కలను తొలగిస్తున్న పీఆర్‌వీ

దక్కిలి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ ఎం శ్రీనివాసులు హెచ్చరించారు. పాతనాలపాడులో సర్వే నంబరు 32-12ఏలో ప్రభుత్వ భూమిని ఆక్రమించడమే కాకుండా అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించి నిమ్మ మొక్కలు నాటినట్లు అందిన ఫిర్యాదుపై గురువారం విచారణ చేపట్టారు. అనంతరం నిమ్మ మొక్కలను తొలగించామన్నారు. ఆక్రమించిన క్రిష్ణయ్యపై క్రిమినల్ కేసు నమోదయిందన్నారు. ప్రజలు కూడా భూ ఆక్రమణలు గమనిస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు.

రెండు మోటారు సైకిళ్ల ఢీ

● ఒకరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. నాయుడుపేట-శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో హోటల్‌ను నిర్వహిస్తున్న కృష్ణమనాయుడు గురువారం శ్రీకాళహస్తి వైపు మోటారు సైకిల్‌పై బయలుదేరాడు. అదే సమయంలో రాంగ్‌రూట్‌లో వచ్చి మరో మోటారు సైకిల్ ఢీకొనడంతో కృష్ణమనాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రాథమిక చికిత్సఅనంతరం మెరుగైన వైద్యసేవలకు చెన్నై తరలించారు.

నేటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

సూళ్లూరుపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం నుంచి ఈనెల20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి ఎన్.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో శుక్రవారం మున్సిపాలిటీ కమిషనర్ చిన్నయ్య చేతుల మీదుగా ఈ వారోత్సవాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. 15న పుస్తక ప్రదర్శన, 16న వివిధ అంశాలపై ప్రముఖుల గురించి ప్రసంగాలు, 17న సెమినార్, 18న చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ పోటీలు,19న మహిళా దినోత్సవం ప్రాముఖ్యత, మహిళలకు సంబంధించిన అంశాలు, 20న అక్షరాస్యత దినోత్సవంతో ముగుస్తాయన్నారు.

నేడు పెళ్లకూరులో ప్రజా దర్బార్

పెళ్లకూరు, నవంబరు, 13 (ఆంధ్రజ్యోతి) : పెళ్లకూరు ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పాల్గొంటారన్నారు. మండల ప్రజలు వారి సమస్యలను నేరుగా ఎమ్మెల్యేకు విన్నవించుకోవచ్చన్నారు.

రైలు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న యువకుడు

తడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. చేనిగుంట దళితవాడ రైల్వే పట్టాల వద్ద సుమారు 25 సంవత్సరాల వయసున్న గుర్తుతెలియని యువకుడు రైలు పట్టాలు దాటేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో ఎగువ మార్గంలో చెన్నై వెళ్తున్న లోకల్ రైలు వేగంగా దూసుకురావడాన్ని గుర్తించాడు. దీంతో ఆ యువకుడు పట్టాలు దాటేందుకు ముందుకు పరిగెత్తాడు. ఈక్రమంలో రైలు అతడ్ని ఢీ కొట్టింది. అతను తీవ్ర గాయాలపాలై స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే స్థానికులు 108కు సమాచారం అందించారు. క్షతగాత్రుడ్ని మెరుగైన చికిత్స కోసం నెల్లూరు తరలించారు. అతనికి సంబంధించి ఆధారాలు లభ్యం కాలేదని రైల్వే సీఆర్‌పీ పోలీసులు తెలిపారు. తెలిసినవారు తమకు సమాచారం అందించాలని సీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు కోరారు

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి నెలరోజుల జైలుశిక్ష

వెంకటగిరిటౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన ముగ్గురికి జైలు శిక్ష విధించారు. ఈ కేసులో పట్టణానికి చెందిన మందా సురేష్, రవి, కరుణాకర్‌లను గురువారం అరెస్టు చేసి కోర్టుకు తరలించామని ఎస్‌ఐ ఏడుకొండలు తెలిపారు. వీరికి న్యాయమూర్తి విష్ణువర్మ నెల రోజులు పాటు జైలు శిక్ష విధించారని ఆయన పేర్కొన్నారు.

150 మందికి ఉచిత వైద్య సేవలు



వెంకటగిరిటౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విశ్వోదయ జూనియర్ కళాశాల వద్ద అమర ఆసుపత్రి(తిరుపతి) సౌజన్యంతో సమరత ఫౌండేషన్, రోటరీ క్లబ్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థల నేతృత్వంలో గురువారం మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 25రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామని డాక్టర్ విజయ్‌కుమార్, లోకేష్, డాక్టర్లు సాయి చందన్‌లు తెలిపారు. శిబిరంలో సుమారు 150మంది పాల్గొని వైద్యసేవలను వినియోగించుకున్నారన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు విజయలక్ష్మి, వెంకటరమణారెడ్డి, విజయ్‌భాస్కర్ రెడ్డి, బేగం, వెంకట్, శ్రీనివాసులు రెడ్డి, జానకీ రాము తదితరులు పాల్గొన్నారు.

వేధింపుల ఫిర్యాదుపై విచారణ



ఉపాధ్యాయులు, ఎంఈవోలను విచారిస్తున్న డీప్యూటీ డీఈవో

వెంకటగిరిటౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జీకేపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోధ్యాయురాలు అపర్ణ తమను వేధిస్తున్నారని ఉపాధ్యాయులు చేసిన ఫిర్యాదు మేరకు గురువారం డీప్యూటీ డీఈవో సనత్‌కుమార్ విచారణ చేశారు. విచారణాంశాలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. విచారణలో ఎంఈవోలు కూడా పాల్గొన్నారు.

జలసిరి..జోరుగా సాగవుతున్న వరి

● మొంథా తుఫాన్‌తో చెరువులు కళకళ ● రబీసాగుకు రైతుల ఉత్సాహం



చిల్లకూరులో వరినారు తీస్తున్న కూలీలు

నాయుడుపేట, నవంబరు, 13 (ఆంధ్రజ్యోతి) : గతంలో రైతులు స్వాతికార్తెలో వరి నాట్లు మొదలుపెట్టేవారు. మకరకార్తెలో ధాన్యం దిగుబడి వచ్చేది. అక్టోబరు, నవంబరు నెలల్లో వేరుశనగ, చెరుకు సాగు చేసేవారు. 20 ఏళ్ల తరువాత దీంతో పాత రోజులు వచ్చాయి. చిత్తకార్తెలో మొంథా తుఫాన్ ప్రభావంతో చెరువులకు నీరు పుష్కలంగా చేరింది. నియోజకవర్గంలో సుమారు 77 వేల ఎకరాల్లో వరిసాగుకు సమాయత్తమవుతున్నారు. దీంతో పొలాలల్లో ఎక్కడ చూసినా గట్లుపని, ట్రాక్టర్లతో దుక్కిలు చేయడం, చెక్కతోలకం, నారుపెరకడం, నాట్లు వేయడం తదితర పనులతో సందడి వాతావరణం నెలకొంది. ఎ ఓ వైపు స్వర్ణముఖినది, కాళంగినది, మరోవైపు తెలుగుగంగ, పాలచ్చూరు కాలువలు ప్రవహిస్తూ పెళ్లకూరు, నాయుడుపేట, ఓజిలి, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ మండలాల చెరువులకు జలకళను తెచ్చిపెట్టాయి. చెరువులు, కుంటలు నిండుకుండలా మారడంతో భూగర్భజలాలు పెరగడంతో అధికారుల అంచనాలకు మించి వరిసాగు జరుగుతోంది. మండలాల వారీగా నాయుడుపేటలో 16 వేలు, పెళ్లకూరులో 19 వేలు, ఓజిలిలో 9 వేలు, దొరవారిసత్రంలో 14 వేలు, సూళ్లూరుపేటలో 11 వేల ఎకరాలు, తడలో 8 వేల ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు. మిగతా పొలాల్లో హార్టికల్చర్ పంటలను సాగుచేస్తున్నారు.

పుష్కలంగా నీరు



చంద్రగిరి నుంచి ప్రారంభమై ఏర్పేడు, శ్రీకాళహస్తి, పెళ్లకూరు, నాయుడుపేట, వాకాడు, కోట తదితర మండలాలలో స్వర్ణముఖి ప్రవహించడం ఈ ప్రాంత ప్రజలకు వరం. ఈ నది వల్ల చెరువులకే కాదు బోరు బావుల్లో కూడా నీరు పుష్కలంగా చేరుతుంది. సాగు,తాగునీరుకు ఢోకాలేదు.

దామెర ప్రసాద్‌నాయుడు, స్వర్ణముఖి నది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్.

తెలుగుగంగ వరం



దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తెలుగు గంగ మంజూరుచేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ నీటిని రైతుల ముంగిటకు చేర్చారు. దీంతో నియోజకవర్గంలోని రైతులు రెండు పంటలతో లాభాలు గడిస్తున్నారు. స్వర్ణముఖినది, తెలుగుగంగ నదులు రైతులకు వరంలాంటివి.

పేరం రమేష్‌నాయుడు, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్.

టీడీపీలో కార్యకర్తల మాటే శిరోధార్యం

● ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లు, గ్రామపార్టీ అధ్యక్షుల చేత ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట/టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : టీడీపీలో కార్యకర్తల మాటే శిరోధార్యమని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట-శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలోని శ్రీనివాస ఫంక్షన్‌హాల్‌లో గురువారం నియోజకవర్గ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లు, గ్రామ పార్టీ అధ్యక్షుల చేత నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంతో కలిసి ఆమె ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ గతేడాది తరహాలోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా సమన్వయంతో పనిచేసి నూరు శాతం విజయం సాధించాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలతో కోటి సంతకాల సేకరణ చేపట్టారని విమర్శించారు. నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ నెల 25 లోగా మిగతా పార్టీ నియమాకాల జాబితా ఖరారవుతుందన్నారు. కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన వెంటనే పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దువ్వూరు చంద్రారెడ్డి, విజయకుమార్‌నాయుడు, సంచి కృష్ణయ్య, శ్రీనివాసులునాయుడు, శంకరయ్య, బొమ్మన శ్రీధర్, సుదర్శన్, గోపీ పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు:పీడీఎస్‌వో



మాట్లాడుతున్న అజిత

వెంకటగిరి టౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ ప్రతిపాదనను విరమించుకోవాలని స్త్రీ విముక్తి సంఘటన(పీడీఎస్‌వో) రాష్ట్ర నాయకులు కె.అజిత డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పింజల వీరయ్య కల్యాణ మండపంలో పీడీఎస్‌వో ఏరియా మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం విద్యను వ్యాపారంగా మార్చే కుట్రన్నారు. పీడీఎస్‌వో నాయకులు పవన్ మాట్లాడుతూ జీవో 107,108లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తొలుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. పీడీఎస్‌వో కార్యదర్శి ఆశ, రాజా, మనోజ్, తేజు, లక్ష్మీ, నరసింహా, శ్రీను, ప్రవళిక, దేవి, భవాని పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీడీపీవో మునికుమారి

కోట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తీరప్రాంత గ్రామాల్లో బాల్య వివాహాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సీడీపీవో మునికుమారి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్‌వాడీ వర్కర్లతో బాల్యవివాహాలపై ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా మునికుమారి మాట్లాడుతూ తీరగ్రామాల్లోని చల్లాయానాదులు, సంచార జాతుల కుటుంబాలు ఇప్పటికీ పాత ఆచారాలను అవలంబిస్తునానయన్నారు. నిబంధనల ప్రకారం నిర్దిష్ట వయసులోనే వివాహాలు చేయాలన్నారు. అతిక్రమించినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్షాల నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు కాచి చల్లార్చిన నీటిని అందించాన్నారు. లేనిపక్షంలో సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సూపర్ వైజర్లు కృష్ణమ్మ, కవిత, సుబ్బమ్మలు ఉన్నారు.

పరిశుభ్రతతో పర్యావరణ పరిరక్షణ



స్వచ్ఛభారత్‌పై స్థానికులకు అవగాహన కల్పిస్తున్న చైతన్య భారతీ కళాసేవ సంస్థ సభ్యులు

తడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చుట్టుపక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని చైతన్య భారతీ కళాసేవా సంఘం కళాజాత బృందం పేర్కొంది. ప్రభుత్వం ఆదేశాల మేరకు సదరు సంస్థ గ్రామ గ్రామాన పారిశుద్ధ్యం, ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ పరిరక్షణ వంటి కార్యక్రమాలపై బజారుకూడలిలో గురువారం కళాజాత అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలు, పారిశుద్ధ్యం వంటి విషయాలపై వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జయప్రద, పంచాయతీ కార్యదర్శి గాబ్రియల్, మస్తాన్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ



వెంకన్నపాళెంలో సంతకాలు పెడుతున్న గ్రామస్థులు

కోట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ చేయరాదంటూ కర్లపూడి, వెంకన్నపాళెం గ్రామాల్లో గురువారం వైసీపీ నాయకులు కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేరిగ మురళీధర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేస్తే ప్రతిభావంతులైన పేద విద్యార్థులు నష్టపోతారన్నారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, రమణయ్య, శ్రీనివాసులు, రేష్మా ఉన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

బాలాయపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కయ్యూరు పీఏసీఎస్ పరిధిలోని రైతులకు పీఏసీఎస్ చైర్మన్ సీసీ నాయుడు గురువారం యూరియా పంపిణీ చేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు అవసరం మేరకు మాత్రమే యూరియా వినియోగించాలని రైతులకు సూచించారు. యూరియా వాడడం వలన ఎంత నష్టం వాటిల్లితుందో విశదీకరించారు. కార్యక్రమంలో ఏవో విజయలక్ష్మి, కయ్యూరు నీటి సంఘం డైరెక్టర్ వీరేపల్లి శివకుమార్, వెంగమాంపురం గ్రామ టీడీటీ అధ్యక్షుడు దామ మధు, టీల్ గోవర్థన్ యాదవ్, వేముల వరాలు, గొట్టి మోహన్ రాము, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పడిపూజకు వైభవంగా ధ్వజారోహణం



అయ్యప్ప ఆలయంలో పూజలు

చంద్రగిరి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఐతేపల్లె వద్ద వెలసిన సుందరగిరి అయ్యస్వామి ఆలయంలో పడి పూజ మహోత్సవానికి గురువారం ధ్వజారోహణం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. పడిపూజ మహోత్సవాలలో భాగంగా సాయంత్రం ఆలయశుద్ధి తరువాత మూలవిరాట్‌కు వివిధ రకాల అభిషేకాలు,ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి ధ్వజారోహణం నిర్వహించారు. అయ్యప్పస్వామి నామస్మరణల నడుమ ఆలయ ట్రస్టీ లెక్కల పురుషోత్తంనాయుడు పడిపూజ మహోత్సవానికి ధ్వజ పటాన్ని ధ్వజంపైకి ఎగురవేశారు.

ఎర్రచందనం స్వాధీనం

ఎర్రావారిపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి); కారులో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తుండ దాడి చేసి స్వాధీనం చేసుకొన్నట్లు భాకరాపేట ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి . మండలంలోని ఉస్తికాయల పెంట, ఎల్లమంద గ్రామాల నుండి కారులో ఎర్రచందనం తరలిపోతుందనే సమాచారం మేరకు తాము మాటు వేసి గురువారం ఉదయం వేకువ ఝామున 3 గంటలకు కారుతో సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. పట్టుబడిన ఎర్రచందనం 150 కేజీలు ఉంటుందని తెలిపారు. ఈ దాడిలో అటవీ సిబ్బంది మునిస్వామి నాయక్ ,రాజేష్, సదాశివయ్య, రోహిత్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు. 300కేజీల ఎర్రచదనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు.

పగిలిన పైపులైన్...వారం రోజులుగా అవస్థలు



పైపు లైన్ నుంచి పేడదిబ్బల్లోకి వెళ్తున్న తాగునీరు- దిగువ ప్రాంతాలకు రంగు మారి వెళ్తున్న నీరు

కోట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కేంద్రమైన తిన్నెలపూడిలో పైపులైన్ పగిలింది. దీంతో స్వచ్ఛమైన స్వర్ణముఖిజలాలు వృథాగా పోతున్నాయి. స్థానిక చెంబడిపాళెంలో ఫిల్టర్ పాయింట్ వేసి పైపులైన్‌ల ద్వారా తిన్నెలపూడి గ్రామానికి తాగునీరు సరఫరా చేస్తున్నారు. వారం రోజులక్రితం ఊర్లోకి వెళ్లే పైపులైన్ పగిలిపోయి తాగునీరంతా పేడదిబ్బ పాలవుతుంది. తాగునీరంతా రంగు మారి గ్రామంలోని దిగువ నివాసాలకు వెళ్తోందని, తాగడానికి ఇబ్బంది పడుతున్నామని అక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగితే రోగాల బారిన పడతామని వీరంతా ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఎంపీడీవో దిలీప్‌కుమార్‌నాయక్ మాట్లాడుతూ తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.